


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 130 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 22 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 130 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 22 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# జీవన్ రెడ్డి నివాసంలో 'బ్రేక్ ఫాస్ట్' రాజకీయం

## మంత్రుల బుజ్జగింపులు ఫలించేనా?

- వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డి
- ఆయనను బుజ్జగించేందుకు వెళ్లిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి, మేడిపల్లి
- మంత్రుల ముందే పార్టీ వైఖరిపై ఆవేదన వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి
- ఉగాది తర్వాత తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని ఇప్పటికే ప్రకటన
- ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తారంటూ వార్తలు



**హైదరాబాద్ పెన్ పవర్:**దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రను పోషించిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ ఫిరాయింపులు, వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రుల బృందం రంగంలోకి దిగింది. ఈ ఉదయం ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపును కూడా తిరస్కరించిన జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన ఇంటికి వెళ్లారు. మీడియాను లోపలికి అనుమతించకుండా, అల్పాహారం చేస్తూ సుమారు గంటన్నర పాటు జీవన్ రెడ్డితో వీరు సుదీర్ఘంగా చర్చలు జరిపారు."నేటి కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు" అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మంత్రుల ముందే తన ఆవేదనను వెళ్లగక్కినట్లు సమాచారం. సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తూ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రులు ఎంత బతిమాలినా జీవన్ రెడ్డి మెత్తబడినట్లు కనిపించడం లేదని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ పార్టీని వీడాలని ఆయన ఇప్పటికే తన నిర్ణయాన్ని తీసేసుకున్నారని తెలుస్తోంది.ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవులకు కూడా జీవన్ రెడ్డి రాజీనామా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఉగాది తర్వాత తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పిన ఆయన, బీఆర్ఎస్ వైపు వెళ్తారా? లేక స్వతంత్రంగా ఉంటారా? అనేది సస్పెన్స్‌గా మారింది.



## ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం ఇజ్రాయెల్ రక్షణ మంత్రి

- యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని స్పష్టీకరణ
- ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉధృతం చేస్తామన్న కాట్జ్
- ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లను లక్ష్యంగా చేసుకుంటామని వెల్లడి

- మిగతా2లో



## దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి ముప్పు?

### స్పీకర్ తీర్పుపై హైకోర్టులో బీజేపీ సవాల్

- తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న పార్టీ ఫిరాయింపుల అంశం
- ఇటీవల దానం సహా అందరికీ క్లీన్ చిట్ ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్
- స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- దానంపై అనర్హత వేటు వేయాలని కోర్టును కోరిన ఏలేటి
- పిటిషన్ పై సోమవారం విచారణ చేపట్టే అవకాశం

- మిగతా2లో



## కబ్జా చేసి ఫామ్ హౌస్ కడితే కచ్చితంగా కూల్చివేస్తాం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

- మాజీ మంత్రి మహేందర్ రెడ్డి ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదన్న రంగనాథ్
- కబ్జాలకు పాల్పడిన వారిని వదిలి పెట్టబోమని హెచ్చరిక
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక హైడ్రాపై రెఫరెండంగా జరిగిందని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ మంత్రి మహేందర్ రెడ్డి ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కానీ ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఫామ్ హౌస్ కడితే అది ఎవరిదైనా కచ్చితంగా కూల్చివేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన, చెరువులు, కుంటల కబ్జాల వెనుక ఎంతటివారు ఉన్నా వదిలి పెట్టబోమని హెచ్చరించారు. దుర్గం చెరువు విషయానికి వస్తే హైడ్రా రాకముందే అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.నల్లకుంట, మాసాబ్ ట్యాంకు, కృష్ణానగర్ ఇలా పలు

- మిగతా2లో


## 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు

- రేవంత్ బాధ్యతలు చేపట్టిన రోజే 6 గ్యారెంటీల ఫైలుపై సంతకం చేశారన్న కేటీఆర్
- ఇప్పుడు ఆ ఫైల్ ఎక్కడుందో తెలియదని విమర్శ
- ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదని మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, వాటికి చట్టబద్ధమైన హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ దూకుడు పెంచింది.

- మిగతా2లో



## దాడులు నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తెరవండి

### ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

- అరబ్ దేశాలపై దాడులను నిలిపివేయాలని విజ్ఞప్తి
- హర్మూజ్ జలసంధిని తెరవాలన్న 22 దేశాలు
- అదే సమయంలో వాణిజ్య నౌకలు, మౌలిక సదుపాయాలపై దాడులపై ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:**అరబ్ దేశాలపై దాడులను నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ, బహ్రెయిన్ సహా 22 దేశాలు ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. అమెరికా–ఇజ్రాయెల్,

- మిగతా2లో

## ఆధునిక యుద్ధాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి

- యుద్ధం అంటే సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదన్న రాజ్‌నాథ్
- సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన భద్రతలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య
- ప్రతి పౌరుడు, యువత దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని పిలుపు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆధునిక యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను, సైబర్ స్పేస్‌ను దెబ్బతీస్తున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని అన్నారు. యుద్ధం సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలో భాగమయ్యాయని పేర్కొన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి దేశపౌరుడు అన్ని సమయాల్లో దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. ఆధునిక యుద్ధాలకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సాయుధ దళాలకు ఆధునాతన, స్వదేశీ ఆయుధాలు,

- మిగతా2లో



## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై స్థానిక బీఆర్ఎస్ నేతల తిరుగుబాటు..?

- హుజూరాబాద్ బీఆర్ఎస్ పార్టీలో ముసలం
- మొన్న రాత్రి సమావేశమైన వందకు పైగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు
- మెజార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం

**హైదరాబాద్ పెన్ పవర్:** హుజూరాబాద్ నియోజక వర్గ రాజకీయం మరోసారి హీటెక్కింది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరును వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇప్పుడు పార్టీని వీడేందుకు సిద్ధమైంది.

- మిగతా2లో



## రంజాన్ వేళ చిన్ననాటి స్నేహితుడ్ని కలిసిన కేసీఆర్

- ఘనంగా ఈద్ ఉల్ ఫితర్
- కేసీఆర్ ను కలిసిన మహ్మద్ జహంగీర్, మహ్మద్ జుబేర్ తదితరులు
- వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు రంజాన్ సందర్భంగా చిన్ననాటి స్నేహి తుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహమ్మద్ జహంగీర్ ను, ఆయన కుటుంబ సభ్యులను కలిశారు.

- మిగతా2లో



# ఎడిటర్ వ్యూ

## బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యతేది?

భవిష్యత్తు మానవ వనరుల నిర్మాణంలో విద్యా కీలకమైనది. రాష్ట్ర సామాజిక, ఆర్థికాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే విధంగా విద్యపై ప్రభుత్వం విధాన నిర్ణయాలు ఉండాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుంది. ఇవి ఆధునికంగా ముందుకుపోని అనాధ కేంద్రాల్లా మిగిలిపోతున్నాయి. నేడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివించే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు గౌరవప్రదమైన విద్యను కోరుకుంటున్నారు. కానీ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేమి, ఉపాధ్యాయుల కొరత, కొరవడుతున్న ప్రభుత్వ నిబద్ధత వలన ప్రభుత్వ విద్యాసంస్థల తీరు అగమ్యగోచరంగా మారాయి. ఈ క్రమంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం విద్య కమిషన్ నియమించింది. ఇటీవల విద్యా కమిషన్ సమర్పించిన విద్యా విధాన పత్రం 2026 విడుదల చేసింది. ఆధునిక విద్యావ్యవస్థకు అవసరమైన సిఫారసులు చేసింది. ఈ విధాన పత్రం విద్యావ్యవస్థ మెరుగుపరచడానికి 18 శాతం నిధులు కావాలని స్పష్టం చేసింది. కానీ, శుక్రవారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో విద్యకు కేవలం 26,674 కోట్లు మాత్రమే ప్రకటించింది. గత ఏడాదితో(7.6 శాతం) పోలిస్తే స్వల్పంగా పెరిగినా మొత్తంగా చూస్తే 8.2 శాతమే నిధులు కేటాయించింది. దేశ సగటు(?14-15శాతం)తో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ నిధులతో విద్యా కమిషన్ సిఫార్సులు ఏ మేరకు అమలవుతాయో ప్రశ్నార్థకమే. మరోవైపు పాఠశాలలో ప్రైమరీ తరగతుల నిర్వహణ, విద్యార్థుల కిట్, బ్రేక్ ఫాస్ట్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇంత తక్కువ బడ్జెట్‌లో ఈ పథకాలు అమలు ప్రకటనలకే పరిమితమయ్యే ప్రమాదం లేకపోలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేర్కొనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ లాంటివి నిర్వహణ ఏ విధంగా అమలు చేస్తారో కూడా సందేహాస్పదమే. ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ఉచిత వైద్యం స్వాగతించాల్సిన అంశం. కానీ రిటైరైన ఉద్యోగుల బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం. ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనం నాణ్యతకు అదనపు నిధులు కేటాయించకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు విద్యావ్యవస్థను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే కార్పొరేట్ విద్యా వ్యవస్థ మరింత పుంజుకుంటుంది. ఇది బడుగు, బలహీన వర్గాల పాలిట శాపంగా మారుతుంది. విద్యను సంక్షేమ చర్యగా, ప్రాధాన్యత కొరవడిన రంగంగా చూడడం సరికాదు. ఆర్థిక కేటాయింపులతో చిత్తశుద్ధి కనబరచినప్పుడే విద్యావ్యవస్థ బాగుపడుతుంది.

# 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు

- మొదటి పేజీ తరువాయి
ఈ అంశా నికి సంబంధించి ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే శుక్రవారం అసెంబ్లీలో తాము 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెట్టబోతున్నామని, దీనికి అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నామని వెల్లడించారు.సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజే 6 గ్యారెంటీల ఫైలుపై సంతకం చేశారని, గవర్నర్ ప్రసంగంలో కూడా ఇదే చెప్పించారని... కానీ ఇప్పుడు ఆ ఫైలు ఎక్కడుందో తెలియడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఈ బిల్లు చట్టంగా మారితే... మహిళలకు రావాల్సిన రూ.2,500, రైతులకు రూ.15,000 రైతు భరోసా, విద్యార్థులకు విద్యా భరోసా వంటివి ప్రజల హక్కుగా మారుతాయని, ప్రభుత్వం ఎగ్గొట్టే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. గతంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కూడా బీజేపీ ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లును ఆమోదించి చట్టం చేసిన దాఖలాలు ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఆరు గ్యారెంటీల్లో కనీసం 'అర' గ్యారెంటీ కూడా సరిగ్గా అమలు కాలేదని, 4 కోట్ల మంది ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఎద్దేవా చేశారు.

# కబ్జా చేసి ఫామ్ హౌస్ కడితే కచ్చితంగా కూల్చివేస్తాం

- మొదటి పేజీ తరువాయి
ప్రాంతాల్లో కబ్జాలు జరిగాయని, అన్నింటిపై దృష్టి సారించామని తెలిపారు. కబ్జాదారులను వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు నివసించే ప్రాంతాలను మాత్రం ముట్టుకోబోమని హామీ ఇచ్చారు. హైడ్రా దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక హైడ్రాకు రెఫరెండంగా జరిగిందని వ్యాఖ్యానించారు.హైడ్రాపై విమర్శలు, ఆరోపణలు చేసిన వారికి వ్యతిరేకంగా ఈ ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. ఇళ్లు కోల్పోయిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఇప్పుడు కాకపోయినా ఏదో ఒకరోజు ప్రతి ఒక్కరు హైడ్రాను మెచ్చుకుంటారని రంగనాథ్ అన్నారు.

# రంజాన్ వేళ చిన్ననాటి స్నేహితుడ్ని కలిసిన కేసీఆర్

- మొదటి పేజీ తరువాయి
ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో ఈ భేటీ జరిగింది. కేసీఆర్‌తో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్‌కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ ను కలిసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్రనేత జుబేర్ మహమ్మద్ కూడా ఉన్నారు. కేసీఆర్ కూడా వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో వారు కేసీఆర్‌కు సంప్రదాయ ఇస్లాం టోపీని బహూకరించగా, ఆయన దానిని ధరించారు. కాసేపు వారితో కలిసి పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సమావేశం పూర్తిగా వ్యక్తిగతంగా, పండుగ వాతావరణంలో స్నేహపూర్వకంగా సాగింది.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై స్థానిక బీఆర్ఎస్ నేతల తిరుగుబాటు..?

- మొదటి పేజీ తరువాయి
రాత్రి జమ్మికుంటలో సుమారు వంద మందికి పైగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు అత్యవసరంగా రహస్య సమావేశం నిర్వహించడం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. ఈ సమావేశానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.కౌశిక్ రెడ్డి పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న వారిని విస్మరిస్తున్నారంటూ నేతలు ఈ భేటీలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత అజెండాను అమలు చేస్తూ పార్టీ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కౌశిక్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడం సాధ్యం కాదని వారు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

ఈ అసమ్మతి సెగ ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల వైపు దారితీస్తోంది. సమావేశమైన నేతల్లో మెజారిటీ సభ్యులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా మంత్రి, కాంగ్రెస్ ముఖ్య నేతలతో వీరు సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో బలమైన ముద్ర వేయాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి, హుజూరాబాద్‌లో జరుగుతున్న ఈ పరిణామాలు పెద్ద ఊరటనిస్తున్నాయి. త్వరలోనే భారీ సంఖ్యలో కౌశిక్ రెడ్డి వ్యతిరేక వర్గం హస్తం గూటికి చేరడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం

ఇరాన్‌పై వచ్చేవారం దాడులు మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉద్ధృతం చేస్తామని కాట్జ్ తెలిపినట్లుగా ఇజ్రాయెల్ పత్రిక ఒకటి తెలిపింది. ఇరాన్ పాలకులు, ఆ దేశానికి ఆదాయవనరుగా ఉన్న మౌలిక సదుపాయాలపై తమ రెండు దేశాలు జరిపే దాడులు మరింత పెరుగుతాయని అన్నారు.ఈ యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని కాట్జ్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు.

ఇరాన్‌పై క్రమంగా సైనిక చర్యను తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛను కల్పించడమే తమ ముందున్న లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ అన్నారు.

# దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి ముప్పు?

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని తన పిటిషన్ లో ఆయన కోర్టును కోరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయాన్ని ఏలేటి తన పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడం పక్కాగా ఫిరాయింపు కిందికే వస్తుందని ఆయన పేర్కొన్నారు.

నామినేషన్ పత్రాలనే ఆధారంగా తీసుకుని దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని ఏలేటి డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పార్టీ మారినప్పటి నుంచి ఆయన ఎమ్మెల్యేగా పొందుతున్న జీతభత్యాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు దగ్గరైన నేపథ్యంలో, దానం నాగేందర్ కేసులో హైకోర్టు ఇచ్చే తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తును కూడా శాసించే అవకాశం ఉంది.

# దాడులు నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తెరవండి

- మొదటి పేజీ తరువాయి
ఇరాన్ యుద్ధం 22వ రోజుకు చేరిన విషయం తెలిసిందే. దాడులు, ప్రతిదాడులు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఇరాన్ అరబ్ దేశాల్లోని అమెరికా సదుపాయాలపై వైమానిక, డ్రోన్ దాడులు చేస్తోంది.ఈ క్రమంలో 22 దేశాలు కలిసి ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. మరోవైపు వాణిజ్య నౌకలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఈ దేశాలు తీవ్రంగా ఖండిం చాయి. ఇరాన్ చర్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఈ దేశాలు సంయుక్త ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశాయి.

### డిగో గార్సియాపై దాడి.. తీవ్రంగా స్పందించిన బ్రిటన్

హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియా ద్వీపంలో ఉన్న యూఎస్-యూకే సైనిక స్థావరం లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడింది. ఈ దాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ దాడులు దుస్సాహసంగా అభివర్ణించింది. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత వంటివి తమ ప్రయోజనాలకు, తమ మిత్రదేశాలకు ముప్పుగా బ్రిటన్ రక్షణ శాఖ తెలిపింది.

# తండ్రి గౌరవం కోసం ఒకరు.. ఆస్తుల కోసం మరొకరు!

వైఎస్ కుటుంబంలో ముదిరిన ఆస్తుల తగాదాపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కన్నతల్లి విజయమ్మే స్వయంగా అఫిడవిట్ విడుదల చేసి ఆవేదన వ్యక్తం చేయడం చూస్తుంటే, జగన్ తన స్వార్థం కోసం కుటుంబాన్ని ఎంతలా రోడ్డుపైకి ఈడ్చారో అర్థమవుతుందని ఆయన మండిపడ్డారు.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ వేల కోట్లు గడించారని, కానీ ఇప్పుడు అవే ఆస్తుల విషయంలో తల్లికి, చెల్లి షర్మిలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి వ్యతిరేకంగా తన సొంత మీడియా సంస్థల్లోనే కథనాలు రాయించిన ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందని, ఇది అత్యంత దారుణమని ఆయన విమర్శించారు. ఆస్తుల కోసం కన్నతల్లిని కూడా గౌరవించకుండా ఆమెను కోర్టుల చుట్టూ, మీడియా ముందుకు వచ్చేలా చేయడం వైఎస్సార్ ఆశయాలకే విరుద్ధమని సోమిరెడ్డి పేర్కొన్నారు.జగన్ తీరుకు భిన్నంగా నారా లోకేశ్ ప్రవర్తన ఉందని సోమిరెడ్డి కొనియాడారు. తండ్రి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టినప్పుడు, లోకేశ్ విశ్రమించకుండా పోరాడి మళ్ళీ ఆయన్ను ముఖ్యమంత్రి సీటులో కూర్చోబెట్టే వరకు శ్రమించారని గుర్తు చేశారు. ఒకవైపు జగన్ తన కుటుంబంలో ఆస్తుల కోసం చిచ్చులు పెడుతుంటే, లోకేశ్ మాత్రం తండ్రి గౌరవం కోసం, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని సోమిరెడ్డి విశ్లేషించారు.

# ఆధునిక యుద్ధాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి

- మొదటి పేజీ తరువాయి
సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశ రక్షణలో యువత తనవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, యువత దేశం కోసం ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సైన్యం, పౌరులు బలంగా ఉంటేనే దేశం ముందుకు సాగుతుందని అన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు.గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. పీపీపీ నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారని, ఇది చారిత్రాత్మక ముందడుగు అన్నారు. ఇది దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందని అన్నారు.

# లక్ష ఉద్యోగాలతో ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గత 21 నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు ఉత్పాదక సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా), రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఈనెల 23వ తేదీన (సోమవారం) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులతో కలిసి భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్నే మార్చగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### లక్ష ఉద్యోగాలతో భారీ ప్రాజెక్టు

సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. తొలిదశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, ఈ ప్లాంట్ ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. దేశీయంగా పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌ను అందుకోవడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది.

### అనుబంధంగా క్యాప్టివ్ పోర్టు.. మరో 6,000 ఉద్యోగాలు

ఈ భారీ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా ఏఎంఎన్ఎస్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనుంది. ఇందుకోసం అదనంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 316 ఎకరాల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ పోర్టును అభివృద్ధి చేస్తారు. ఈ పోర్టు నిర్మాణం ద్వారా మరో 6,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా (హబ్) రూపాంతరం చెందనుంది.

### ప్రభుత్వం సంపూర్ణ సహకారం

ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. పరిశ్రమకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను శరవేగంగా కల్పిస్తోంది. ప్లాంట్‌ను జాతీయ రహదారి-16తో అనుసంధానించేందుకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులను కూడా ప్రభుత్వం చేపట్టింది.

### సీఎం పర్యటన వివరాలు

సోమవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆయన అమరావతి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం రాజయ్యపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3:40 గంటలకు ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి, అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక తిరిగి అమరావతికి పయనమవుతారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేశ్ సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి



- స్మార్ట్ ఫోన్ ఇప్పుడు ఆడపిల్లల పాలిటశాపంగా మారుతోందన్న సజ్జనార్
- సినీ నటుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని హెచ్చరిక
- మోసగాళ్ల మాటలు నమ్మి అమ్మాయిలు వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు పంచుకుంటున్నారని ఆందోళన
- వాటిని అడ్డం పెట్టుకుని మోసగాళ్లు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని హెచ్చరిక

హైదరాబాద్ పెన్ పవర్:స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు

-4 లో

# పెన్ పవర్



## తెలంగాణ రౌండప్



# ప్రాణాలు కాపాడాల్సిన వాహనంలో..! ప్రైవేట్ ప్రయాణం..?




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో చక్కర్లు కొడుతున్న తెలంగాణ 108 అంబులెన్స్..

- తెలంగాణ 108 అంబులెన్స్ రాజమండ్రిలో ప్రత్యక్షం..
- నిబంధనలకు పాతర.. ? ఈసీఐఎల్ 'టు' వయా నిజాంపేట్ 'టు' రాజమండ్రి..
- 108 అంబులెన్స్ సర్వీస్‌లలో ఏం జరుగుతోంది..?

- హైదరాబాద్ ఈసీఐఎల్ నుంచి బయలుదేరిన 108 అంబులెన్స్..
- నిజాంపేట్ మీదుగా రాజమండ్రి చేరినట్లు జిపిఎస్ లొకేషన్‌లు వైరల్..
- అంబులెన్స్ అక్కడ ఉన్నట్లు అంగీకరించిన ఇఎంటి..
- పై అధికారులనే అడగాలంటూ బాధ్యతా రహిత సమాధానం..!
- నిబంధనల ప్రకారం 108 సేవలు రాష్ట్ర పరిధికే పరిమితం..
- అంతర్రాష్ట్ర ప్రయాణాలపై అనుమానాలు వ్యక్తం..
- రోగి తరలింపు కోసం వెళ్లిందా..? లేక ప్రభుత్వ వాహనం దుర్వినియోగమా..?
- అత్యవసర సమయంలో స్థానికులకు సేవలు లేకపోతే బాధ్యత ఎవరిది..?

హైదరాబాద్‌లో అత్యవసర సేవల కోసం కేటాయించిన 108 అంబులెన్స్, నిబంధనలను పక్కనబెట్టి ఏకంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో ప్రత్యక్షమవ్వడం తీవ్ర వివాదానికి దారితీసింది. ప్రాణాలను కాపాడాల్సిన వాహనం ఇలా రాష్ట్ర సరిహద్దులు దాటడం వెనుక అసలు కారణం ఏమిటి..? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.. ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, పూర్తి స్థాయి విచారణ జరపాలనే డిమాండ్ వెల్లువెత్తుతోంది..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 21:

ప్రాణాలు కాపాడాల్సిన అత్యవసర వాహనాలు పక్కదారి పడుతున్నాయా..? ఇప్పటికే గతంలో సోషల్ మీడియాలో ఇతర రాష్ట్రాలలో అంబులెన్స్‌లో ఇలాంటి ఘటనలు చూశాం.. ఇప్పుడు తెలంగాణలో బహుశా మొట్టమొదటి సారి బట్టబయలు అయింది కాబోలు.. నిబంధనల ప్రకారం రాష్ట్ర సరిహద్దులు దాటకూడని 108 అంబులెన్స్‌లు, ఏకంగా పక్క రాష్ట్రాల్లో చక్కర్లు కొడుతున్న ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ లోని ఈసీఐఎల్‌కు చెందిన ఒక 108 అంబులెన్స్ ఏపీలోని రాజమండ్రిలో ప్రత్యక్షమవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది..

### వైరల్ అవుతున్న జీపీఎస్ లొకేషన్..

ఈసీఐఎల్ ప్రాంత ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కేటాయించిన 108 అంబులెన్స్.. ముందుగా నిజాంపేట్‌కు వెళ్లాలని నమోదు చేసుకుని అక్కడి నుంచి ఏకంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి వెళ్లినట్లు చెబుతున్నారు.. ఇందుకు సంబంధించిన జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) లొకేషన్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో, స్థానిక మాధ్యమాల్లో విపరీతంగా సర్క్యులేట్ అవుతున్నాయి. అధికారులనే అడగాలన్న ఈఎంటీఈ వ్యవహారంపై సదరు అంబులెన్స్ ఈఎంటీని సంప్రదించగా.. వాహనం రాజమండ్రిలో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించడం గమనార్హం.. ఇలా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి 108 వాహనం వెళ్లడానికి నిబంధనలు ఒప్పుకుంటాయా..? అని ప్రశ్నించగా.. నాది చాలా చిన్న పోస్ట్.. దీనిపై నాకేమీ తెలియదు, పై అధికారులనే అడిగి తెలుసుకోవాలని ఆయన చెప్పుకొచ్చారు..

### సమాధానం కోసం ప్రశ్నలు ఉత్పన్నం..

ఇవేసాధారణంగా 108 సేవలు కేవలం ఆయా రాష్ట్ర పరిధిలోని అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితం. మెరుగైన వైద్యం కోసం కూడా పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లే అనుమతి వీటికి ఉండదు. అలాంటప్పుడు ఈసీఐఎల్ అంబులెన్స్‌కు రాజమండ్రి వెళ్లే అనుమతి ఎవరు ఇచ్చారు..? ఇది ఎవరైనా రోగిని తరలించడానికి వెళ్ళిందా..? లేక ఎవరైనా ఉన్నతాధికారుల సొంత పనుల కోసం ప్రభుత్వ వాహనాన్ని దుర్వినియోగం చేశారా..? అన్నది తేలాల్సి ఉంది. అత్యవసర వాహనం ఏపీలో ఉన్న సమయంలో, ఇక్కడ ఈసీఐఎల్ ప్రాంతంలో ఎవరికైనా ప్రాణాపాయం జరిగితే బాధ్యత ఎవరిది..?ఈ ఘటనపై 108 ఉన్నతాధికారులు మరియు వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే స్పందించి, విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఈ విషయంలో పై అధికారులు చెప్పడం వలనే తెలంగాణ 108 వాహనం రాజమండ్రికి వెళ్ళడం జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతుంది.

## కేంద్రమంత్రి అమిత్ షాకు రాజాసింగ్ లేఖ



- తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందంటూ లేఖ
- తాను పలుమార్లు లేఖ రాశానని వెల్లడి
- భద్రత కల్పించాలని లేఖలో కోరిన రాజాసింగ్

-4 లో

## తెలంగాణలో మాంసాహారం జోరు..

### పదేళ్లలో 5 రెట్లు పెరిగిన మాంసం వినియోగం

- 2024-25 నాటికి 11 లక్షల టన్నులకు చేరిన మాంసం వినియోగం
- గొర్రెల పెంపకంలో దేశంలోనే తొలి స్థానం
- 1,935 కోట్లకు పెరిగిన గుడ్ల వినియోగం



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ గడ్డపై మాంసాహార ప్రియుల జోరు ఏ స్థాయిలో ఉందో తాజా ఆర్థిక సర్వే కళ్లకు కట్టింది. గత పదేళ్లలో రాష్ట్రంలో మాంసం వినియోగం ఊహించని రీతిలో 5 రెట్లు పెరగడం గమనార్హం. కేవలం తిండిలోనే కాదు, పశుసంపద ఉత్పత్తిలోనూ తెలంగాణ దేశవ్యాప్తంగా తన జెండాను పాతేస్తోంది.తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ - 2026 సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. 2013-14లో కేవలం 2.30 లక్షల టన్నులుగా ఉన్న మాంసం వినియోగం... 2024-25 నాటికి ఏకంగా 11.01 లక్షల టన్నులకు చేరుకుంది. గొర్రెల పెంపకంలో కూడా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. పౌల్ట్రీ రంగంలో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది.కేవలం మాంసమే కాదు, అనుబంధ రంగాల్లో కూడా తెలంగాణ వృద్ధి అద్భుతంగా ఉంది. పదేళ్ల క్రితం 1,006 కోట్లుగా ఉన్న గుడ్ల వినియోగం, ఇప్పుడు 1,935.26 కోట్లకు పెరిగింది. అంటే సగటున ప్రతి ఒక్కరి ఆహారంలో గుడ్ల వాటా రెట్టింపు అయ్యింది.

## కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్



- గత శనివారం అంజన్న ఆశీర్వాద యాత్ర ముగింపు సమయానికి ఆలయం మూసివేత
- నిన్న మళ్లీ ఆలయానికి వచ్చిన బండి సంజయ్
- ఆశీర్వచనాలు, ప్రసాదం అందించిన అర్చకులు

హైదరాబాద్ పెన్ పవర్:జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో నేడు ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత శనివారం నిర్వహించిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు. ఆ వెలితిని పూడ్చుకుంటూ నేడు మళ్ళీ ఆలయానికి విచ్చేశారు.
అర్చకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి

-4 లో



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

- సిద్దిపేట అభివృద్ధికి నిధులు రద్దు చేశారని ఆరోపణ
- రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో బహిరంగ లేఖ
- బీఆర్ఎస్ హయాంలో మంజూరై, కాంగ్రెస్ వచ్చాక రద్దైన పనులు అంటూ జాబితా విడుదల

హైదరాబాద్ పెన్ పవర్:సిద్దిపేట అభివృద్ధికి నిధులు రద్దు చేశారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.నేడు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన పలు ప్రశ్నలతో బహిరంగ లేఖ రాశారు.సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం తాము చేస్తే శిలాఫలకం మీది ఎందుకని ప్రశ్నించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు.

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

-3 పేజి తరువాయి

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్ధిపేటకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గం లేదన్నట్లుగా ఇన్నాళ్లు వ్యవహరించారని విమర్శించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట సిద్ధిపేటలో అడుగుపెడుతున్న ముఖ్యమంత్రికి తాను పలు ప్రశ్నలు సంధించదలుచుకున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ పామాయిల్ ఫ్యాక్టరీ అని పేర్కొన్నారు. కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన కృషి ఫలితమే అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు, పామాయిల్ తోటల సాగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. 2021 జూన్ 5న తొలి పామాయిల్ మొక్కను నాటింది తానేనని వెల్లడించారు. 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్‌ను ప్రారంభించామని తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీకి పునాదిరాయి వేసి పనులు ప్రారంభించామని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత్ర కొండంత అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర గోరంత కూడా లేదని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 1,070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశారని ఆరోపించారు. నిధులను రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు అధికారిక పర్యటన చేస్తున్నందున, ఆ నిధులన్నీ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. రూ. 170 కోట్ల మేర రైతు భరోసా నిధులు రాలేదని, వాటిని రేపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రద్దయి ఆగిపోయిన పనుల జాబితాను ఆయన పేర్కొన్నారు. రంగనాయకసాగర్ టూరిజం, కోమటిచెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగు రోడ్డు, తోర్నాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, మిట్టపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం, సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్, టు టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, సిద్దిపేట–ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు, -- సిద్దిపేట–కిష్టాపూర్ రహదారి, సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం, సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ ఆగిపోయాయని అన్నారు.

# సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి

-3 పేజి తరువాయి

యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. "ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది. సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారు" అని తెలిపారు. ఆ ఫోటోలను వారితో పంచుకోగానే ఆ అపరిచితులు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు

ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు విజ్ఞప్తి ఒక్కటేనని, మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడవద్దని, ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దని, ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని అన్నారు. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు

అనేదానిపై గమనిస్తూ ఉండాలని సూచించారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు పట్టుబడబోమని సైబర్ నేరగాళ్లు భ్రమల్లో ఉండవద్దని, మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో సేమియా పంపిణీ

**కొత్తగూడెం పెన్ పవర్:** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ముస్లిం సోదరులకు సేమియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీ సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు అభినందనలు తెలిపి, నెలరోజులపాటు కఠిన దీక్షలతో , నియమనిష్టలతో చేపట్టిన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని మానవాళి హితాన్ని ఆకాంక్షించే ఆధ్యాత్మిక వికాసానికి సురుద్భావానికి ప్రతీక ఈ రంజాన్ పండుగ పవిత్ర గ్రంథం అయిన ఖురాన్ను అనుసరిస్తూ సామాజిక ప్రేమ శాంతి సౌభ్రాతృత్వానికి నిదర్శనమైన రంజాన్ పండుగను ఆనంద ఉత్సవాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అల్లా ఆశీస్సులు దీవెనలు ఎల్లప్పుడూ మీ మీద మీ కుటుంబ సభ్యుల మీద ఉండాలని అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని

ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం సోదరులకు సేమియా తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా రుద్రంపూర్, రామవరం, కొత్తగూడెం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన అనంతరం ముస్లిం సోదరులకు మజ్జిగ, మంచినీళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు,




కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, ఆళ్ల మురళి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్పొరేటర్లు ఎండి దావత్ కేకే శ్రీను, సర్పంచ్ వీరన్న, ఐఎన్టి యుసి కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబరం, నాయకులు కిషన్, కనకరాజు, తెలుగు అనిల్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో దళితులకు భారీ కోత




**బడ్జెట్ లో చేవెళ్ల ఎస్సి ఎస్టీ డిక్లరేషన్ ఊసేలేదు**

**ప్రభుత్వం దళితులను మోసగిస్తే రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం**

**కెవిపిఎస్ నాయకులు కురంది సురేష్ మందుల యాకూబ్**

**హైదరాబాద్ పెన్ పవర్:**

2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర అసెంబ్లీలో మల్లు భట్టి విక్రమార్క 3.24.254కోట్ల రూ. లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో దళితులకు భారీ కోత పెట్టారని 40వేల కోట్ల రూ. ల నుండి 11.784 కోట్ల రూ లకు తగ్గించి దళితులను మోసగించారని

ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన చేవెళ్ల ఎస్సి ఎస్టీ డిక్లరేషన్ ఊసెత్త లేదని బడ్జెట్లో దళితులను మోసగించిన తీరుపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) నాయకులు మందుల యాకుబ్ మాట్లాడుతూ

దళితుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ లోనే దళితులను మోసగించిందని బడ్జెట్లో దళిత సంక్షేమానికి ప్రభుత్వ కేటాయింపులకు విడుదలకు ఖర్చుకు మధ్యన ఏమాత్రం పొంతన ఉండటం లేదని విమర్శించారు గత బడ్జెట్ లో 40 వేల కోట్ల రూపాయలు కాగితాల్లో కేటాయించి 19 వేల కోట్ల రూపాయలు విడుదల చేసి అందులో 14 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు చూపించారని చెప్పారు. 9 శాఖలు నయా పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు

2026-27 సంవత్సరానికి ఆర్థిక సంవత్సరానికి 11784కోట్ల రూ. లు కేటాయించారని చెప్పారు. ఎస్సి ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఎక్స్ గ్రేషియోలు వేలాది మంది కి బాధితులకు బడ్జెట్ లేమి తో అందలేదన్నారు కులాంతర వివాహితుల ప్రోత్సాహకాలు రెండేండ్లుగా పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. మొత్తం ఎస్సీ సంక్షేమం పైన ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. బడ్జెట్లో ప్రతి ఏట అంకెలు మాత్రమే ఉంటున్నాయని అవి ఖర్చుకు నోచుకోకపోవడంతో దళితుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం దక్కట్లేదన్నారు విద్యార్థులు తీవ్ర స్వస్థత గురికావడం ఆత్మహత్యలు జరగడం పరిపాటిగా మారిందన్నారు హాస్టల్ అద్దె భవనాల కిరాయిలు చెల్లించకపోవడం, బెస్ట్ అవైలే బుల్ స్కూల్ పిల్లలకు బడ్జెట్ ఇవ్వకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను నానా రకాలుగా ఇబ్బందులు పెట్టిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజీవ్ యువశక్తి పథకం క్రింద 16 లక్షల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం 6000కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందన్నారు అవి ఏమాత్రం సరిపోవు అన్నారు ఎస్సీ జనాభా 18% ఉండగా ప్రభుత్వ కేటాయింపులు జనాభా దామరక్ష ప్రకారంగా లేవన్నారు గత మూడేళ్ల కాలంలో కేటాయించిన బడ్జెట్ పెట్టిన ఖర్చు మొత్తం దళితుల బడ్జెట్ పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్

-3 పేజి తరువాయి

ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీజేపీ నేతలు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

# కేంద్రమంత్రి అమిత్ షాకు రాజాసింగ్ లేఖ


**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందంటూ ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయానికి సంబంధించి తాను పలుమార్లు లేఖ రాశానని ఆయన పేర్కొన్నారు. తనకు భద్రత కల్పించాలని ఆయన లేఖలో అమిత్ షాను కోరారు. కాగా, రాజాసింగ్‌కు పలుమార్లు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రాణహాని తలపెట్టేలా మరోసారి బెదిరింపు లేఖ వచ్చింది. ఈ నెల 27న శ్రీరామ నవమి శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 27వ తేదీలోగా రాజాసింగ్‌ను చంపేస్తామంటూ ఆగంతుకులు ఆ లేఖలో హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అమిత్ షాకు లేఖ రాశారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి మరో షాక్




**హైదరాబాద్ పెన్ పవర్:** పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ పార్టీ ఉదంతం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ ఫామ్‌హౌస్‌పై పోలీసులు జరిపిన మెరుపు దాడిలో డ్రగ్స్ కోణంతో పాటు భూ అక్రమాల వ్యవహారం కూడా బయటపడింది. డ్రగ్స్ కార్యకలాపాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్కడ ఉన్న విలాసవంతమైన వాహనాలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఫామ్ హౌస్ ఉన్న అసైన్డ్ భూమి వివాదం తెరపైకి వచ్చింది. సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఫామ్‌హౌస్‌ను నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో 2006లో ఈ భూమి రిజిస్ట్రేషన్ అయినట్టు రికార్డుల్లో ఉంది. అయితే, భూభారతి రికార్డుల ప్రకారం ఇది 'జంగయ్య' అనే వ్యక్తి పేరు మీద ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని విక్రయించడం లేదా రిజిస్ట్రేషన్ చేయడం చట్టవిరుద్ధం. ఈ నేపథ్యంలో... అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది? ఇందులో అధికారుల పాత్ర ఏంటి? అనే అంశాలపై సిట్, రెవెన్యూ విభాగం లోతుగా విచారిస్తున్నాయి.

# సౌదీపై ఇరాన్ క్షిపణి దాడుల్లో తెలంగాణ వ్యక్తి దుర్మరణం



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ జ్వాలలు ఓ తెలుగు వ్యక్తిని బలిగొన్నాయి. సౌదీ అరేబియాపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల కారణంగా తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాకు చెందిన రవిగోపాల్ అనే వ్యక్తి మృతి చెందినట్టు భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడుల వల్ల ఇప్పటివరకు మరణించిన భారతీయుల సంఖ్య ఆరుకు చేరుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మార్చి 18వ తేదీ రాత్రి సౌదీ రాజధాని రియాద్‌లోని కీలక లక్ష్యాలపై ఇరాన్ నాలుగు క్షిపణులను ప్రయోగించింది. అయితే సౌదీ గగనతల రక్షణ వ్యవస్థలు వాటిని గాలిలోనే కూల్చివేశాయి. దురదృష్టవశాత్తూ, కూల్చివేసిన క్షిపణి శకలాలు రియాద్‌లోని ఒక ఆయిల్ రిఫైనరీ సమీపంలో పడ్డాయి. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న రవిగోపాల్‌పై ఈ శకలాలు పడటంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రవిగోపాల్ మృతి సమాచారంతో ఆయన కుటుంబం ఇప్పుడు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. "18వ తేదీ రాత్రి 9.30 గంటలకు రవితో 20 నిమిషాల పాటు మాట్లాడాం. ఆ తర్వాత కాల్ కట్ అయ్యింది, అప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది" అని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రవికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఇంటికి ఆయనొక్కడే ఆధారం. ఇంటికి రవి ఒక్కడే ఆధారం. ఆయనకు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. రవి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి చేర్చాలని, అనాథలైన తమ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు. మరోవైపు, విదేశాంగ శాఖ అధికారి అసీమ్ మహాజన్ మాట్లాడుతూ... మృతుడి కుటుంబంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉన్న భారతీయులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఇబ్రహీంపట్నంలో హోండా అమేజ్ కారు బీభత్సం..రోడ్డుపక్కన కూర్చున్న నలుగురిని ఢీకొట్టింది

**హైదరాబాద్ పెన్ పవర్:** బైక్ లేదా కారు నడుపుతున్నపుడు ఆక్సిలరేటర్ పెంచడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది. వేగంగా వెళ్తున్న ఎంజాయ్ చేస్తుంటారు. అయితే అతివేగం ప్రమాదాలకు కారణం కావచ్చు..నడిపే వారు మాత్రమే కాదు, అమాయక ప్రయాణికులు కూడా బలవుతారు. వేగాన్ని నియంత్రించకపోతే, ట్రాఫిక్స్ రూల్స్ పాటించకపోతే ఏం జరుగుతుందో రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘటన అందుకు సాక్ష్యం. రంగారెడ్డి జిల్లాలో కారు బీభత్సం సృష్టించింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని శేరిగూడ దగ్గర అతివేగంతో హోండా అమేజ్ నలుగురిని ఢీకొట్టింది. అమాయకులను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టింది. వారి కుటుంబాలకు కన్నీటిని మిగిల్చింది. వివరాల్లోకి వెళితే..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని శేరిగూడ శేరిగూడ స్టేజీ దగ్గర శనివారం (మార్చి21) సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. బస్సుకోసం రోడ్డుపక్కన కూర్చున్న నలుగురిని వేగంగా దూసుకొచ్చిన హోండా అమేజ్ కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో నరాలపోచమ్మ, నరాల అలివేలు, లక్ష్మమ్మ, పెంటమ్మలను ఢీకొనడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని సాయి సంజీవని ఆస్పత్రికి తరలించారు. బాధితులను వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతలో వేగం ఒక ఫ్యాషన్‌గా మారింది. ముఖ్యంగా ఖరీదైన బైక్‌లు, కార్లు వచ్చిన తర్వాత రోడ్లపై విన్యాసాలు చేయడం పెరిగిపోయింది. భారతదేశంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 70% కంటే ఎక్కువ 'అతివేగం' వల్లే జరుగుతున్నాయని రిపోర్టులు చెబుతున్నాయి. అతివేగం.. క్షణకాలపు థ్రిల్ అనేక మంది జీవితాల్లో విషాదం నింపుతున్నాయి. అతివేగంపై పోలీసులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. అతివేగానికి సెక్షన్ 183 (వీఎ ఇాఖ్) కింద భారీ ఫైన్ ,ప్రమాదకరంగా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. ఎదుటివారి మరణానికి కారణమైతే నాన్-బైలబుల్ కేసులు నమోదు చేస్తున్నారు పోలీసులు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాష్ట్ర ప్రజలను అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసం చేస్తూ, అవినీతికి పాల్పడుతూ, హిందూ వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగుతోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ విమర్శించారు. శనివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసం చేస్తూ, అవినీతి మరియు నిర్వీర్యమైన పాలనతో తెలంగాణను సంక్షోభంలోకి నెట్టింది. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇక ప్రజల ముందే నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సారథ్యంలో అసెంబ్లీ ముట్టడి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యత వహించేలా చేస్తామన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, నిరుపేదలు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యలతో మార్చి 23న జరిగే అసెంబ్లీ ముట్టడిలో పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ సర్కారును నేరుగా ప్రశ్నించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలా ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తేనే మార్పు సాధ్యం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా ప్రజల పక్షాన పనిచేసేలా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఏ విషయంపై మాట్లాడినా 'డబ్బులు లేవు' అనే సమాధానమే వినిపిస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణను ఈ దుస్థితికి తీసుకువచ్చాయిని దుయ్యబట్టారు. బడ్జెట్‌లోనైనా ప్రజలకు ఉపయోగపడే చర్యలు తీసుకుంటారని ఆశించినా, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తూ, ప్రజల హక్కుల సాధన కోసం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కాంగ్రెస్ ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ నాయకులను ప్రజల ముందే నిలబెట్టి నేరుగా ప్రశ్నిద్దాం. ప్రజా సమస్యలను నిజంగా పరిష్కరిస్తారా? లేక మాటలకే పరిమితమవుతారా? అనే విషయంలో స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేద్దాం. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా తప్పించుకునే రాజకీయాలకు ఇక స్థానం లేదని తెలియజేయాలన్నారు. అలా చేయకపోతే, ప్రజలే వారిని ఎక్కడికక్కడ నిలదీసే పరిస్థితిని తీసుకురావాలి. హైదరాబాద్‌లోనే కాదు, తెలంగాణలోని ఏ గ్రామానికైనా వెళ్లినా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే అన్న పరిస్థితి తీసుకురావాలన్నారు. ఈ అసెంబ్లీ ముట్టడిలో తెలంగాణలోని నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలి, "ఉద్యోగాలు వస్తాయి" అనే ఆశతో ఎన్నాళ్లుగానో ఎదురుచూసి చివరకు నిరాశ చెందిన ప్రతి నిరుద్యోగి ముందుకు రావాలి. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అందక కాలేజీలకు వెళ్లలేని దుస్థితిలో ఉన్న విద్యార్థులు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి. "ఎప్పటికైనా మాకు ఇల్లు వస్తుంది" అని ఆశపడి ఇప్పటికీ ఇల్లు అందని నిరుపేదలు కూడా తమ గళం వినిపించాలి. వృద్ధాప్యంలో పని చేయలేని పరిస్థితిలో ఉండి, ప్రభుత్వం హామీ ఇచ్చిన పెన్షన్ కోసం ఎదురుచూస్తూ మోసపోయామని భావిస్తున్న వృద్ధులు కూడా తమ ఆవేదనను ప్రజల్లో వినిపించాలి. అలాగే రైతు భరోసా అందక మోసపోయామని భావిస్తున్న ప్రతి రైతు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేసారు. మార్చి 23వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేరుగా ప్రశ్నించే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. మనం రోడ్లపైకి రాకపోతే మార్పు సాధ్యం కాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలు రోడ్లపైకి వచ్చి, వంటవార్పు చేస్తూ, నిరంతర పోరాటం చేసినందువల్లే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగాం. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా బాధ్యత వహించేలా, ప్రజల మాట వినేలా చేయడానికి ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. అందువల్ల ప్రతి ఒక్కరు ఈ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య , బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా , బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

# భీమన్నను దర్శించుకున్న మల్టీ జోన్1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

**వేములవాడ: పెన్ పవర్:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయానికి విచ్చేసిన ఐజీపీ కి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఈవ ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి పోలీసు అధికారులతో మాట్లాడుతూ, దక్షిణకాశిగా పేరుగాంచిన వేములవాడకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని అన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో గస్తీ పెంచాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేములవాడ మరియు సిరిసిల్ల డీఎస్పీలు శ్రీనివాస్, నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

# భారంగా మారనున్న చికెన్



**హైదరాబాద్, మార్చి 21: పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ప్రియులకు ఆదివారం భోజనం భారంగా మారబోతోంది. నిన్నటి వరకు సాదాసీదాగా ఉన్న కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. కేవలం ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ఏపీలో నిన్నటి కంటే ఈరోజు ఏకంగా రూ. 70 అదనంగా పెరగడం గమనార్హం. విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది. హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు. అసలు దీని ధర అడిగితేనే గుండె జారిపోయేలా ఉంది. కిలో నాటుకోడి ఏకంగా రూ. 800 పలుకుతోంది. అంటే దాదాపు మటన్ ధరతో పోటీ పడుతోంది. వ్యాపారులు మరియు పౌల్ట్రీ రైతుల విశ్లేషణ ప్రకారం ఈ పెరుగుదల వెనుక ఐదు కీలక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన ఎండల వల్ల కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. దీంతో మార్కెట్‌లోకి రావాల్సిన సప్లై గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రంజాన్ పండుగ కావడంతో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ రెట్టింపయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. అలాగే కోళ్లకు వేసే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు రేట్లు పెంచక తప్పడం లేదు.

## మూసి తీరంలో అక్రమ సమోసాల దందా

**హైదరాబాద్, మార్చి 21: పెన్ పవర్:** హైదరాబాద్‌వాసులు ఇష్టమైన చిరుతిండి సమోసా వెనుక దాగి ఉన్న భయంకరమైన నిజం వెలుగులోకి వచ్చింది. పైన కరకరలాడుతూ, లోపల రుచిగా అనిపించే సమోసాలు వాస్తవానికి కుళ్లిపోయిన పదార్థాలతో తయారవుతున్నాయే షాకింగ్ నిజాన్ని కుల్సుంపురా పోలీసులు బయటపెట్టారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ ఆపరిశుభ్ర వాతావరణంలో కల్తీ పదార్థాలతో సమోసాలు తయారు చేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్సై నర్సింహ తన టీంతో కలిసి జియాగూడ బైపాస్ రోడ్డులోని మూసీ తీరంలో ఉన్న ఒక షెడ్డుపై ఆకస్మిక దాడి చేశారు. గోల్కొండకు చెందిన అబ్దుల్ రషీద్ (73)అనే వ్యక్తి ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి ఇక్కడ సమోసాలు తయారీ సాగుతోంది. కేవలం లాభార్జనే ధ్యేయంగా పెట్టుకున్న నిర్వాహకుడు ఐదారుగురు కార్మికులతో కలిసి ఈ అక్రమ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసిన దృశ్యాలు అధికారులనే విస్మయానికి గురి చేశాయి. ఈ కేంద్రంలో వినియోగిస్తున్న పదార్థాలన్నీ అత్యంత నాసిరకమైనవి, అనారోగ్యకరమైనవి. సమోసాలు నింపే మిశ్రమం కోసం కుళ్లిపోయిన కోడిగుడ్లను వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన, పదే పదే మరిగించిన కల్తీ వంట నూనెలను ఇక్కడ వాడుతున్నారు. సమోసా తయారీలో ఉపయోగించే ఆలుగడ్డలు, ఇతర కూరగాయలు కూడా కుళ్లిపోయినవేనని పోలీసులు ధ్రువీకరించారు. నిల్వ ఉండిపోయిన పురుగు పట్టిన మైదా పిండిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు. ఈ కేంద్రంలో తయారైన కల్తీ సమోసాలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కావడం లేదు. జియాగూడ పరిసర ప్రాంతాల్లో అనేక హోటళ్లు, బేకరీలు, వీధి వ్యాపారులకు ఇక్కడి నుంచి పెద్ద మత్తంలో సరకు సరఫరా అవుతోంది. వినియోగదారులు ఆ రుచికి ఆకర్షితులవుతున్నప్పటికీ, లోపల జరుగుతున్న ఈ అక్రమ తంతూ ఎవరికీ తెలియదు. సాధారణంగా ఏదైనా ఆహార పదార్థాల తయారీ కేంద్రం నడపాలంటే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ పొందాలి. కానీ అబ్దుల్ రషీద్ నడుపుతున్న ఈ షెడ్డుకు ఎటువంటి అనుమతులు లేవు. పూర్తి అపరిశుభ్రమైన వాతావరణంలో నేలపైనే పిండిని కలుపుతూ, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో పోలీసులు పెద్ద మొత్తంలో మైదా, కల్తీ నూనెలు, కుళ్లిన గుడ్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు అబ్దుల్ రషీద్‌ను

# కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ సూసైడ్- ఐదు రోజుల క్రితమే భార్య ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. జమ్మికుంట మండలం సీతంపేటలోని అత్తారింటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య దివ్య ఐదు రోజుల క్రితమే సూసైడ్ చేసుకుంది. ఇంతలో ఆయన కూడా ఇలా చనిపోవడం అందర్నీ షాక్‌కి గురి చేసింది. ఒకే కుటుంబంలో కొద్ది రోజుల వ్యవధిలోనే జరిగిన రెండు వరుస మరణాలు కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపాయి. ప్రాణ సమానంగా ప్రేమించిన భార్య అకాల మరణాన్ని తట్టుకోలేక, ఆమె లేని లోటును భరించలేక ఓ బాధ్యతాయుతమైన పోలీస్ అధికారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య చనిపోయిన ఐదు రోజులకే ఆయన కూడా అదే బాట పట్టడం స్థానికంగా అందర్నీ కలిచివేసింది. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దేశ్ చంద్రశేఖర్ శనివారం సూసైడ్ చేసుకున్నారు. జమ్మికుంట మండలం పరిధిలోని సీతంపేటలో ఉన్న తన అత్తవారి ఇంటికి వెళ్లి అక్కడే ఉరేసుకొని ప్రాణాలు విడిచారు. విధి నిర్వహణలో ఎంతో చురుకుగా ఉండే చంద్రశేఖర్ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం పోలీస్ శాఖలో కలకలం రేపింది. చంద్రశేఖర్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం భార్య దివ్య మృతి అని స్థానికులు చెబుతున్నారు. సరిగా ఐదు రోజుల క్రితం దివ్య ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా ఆమె తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. గత మంగళవారం మధ్యాహ్నం ఆ నొప్పిని భరించలేక గన్నేరు పువ్వుల రసం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఆ సమయంలో విధుల్లో ఉన్న చంద్రశేఖర్‌కు దివ్య ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆయన వెంటనే ఆమెను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి దివ్య మరణించింది. దివ్య తండ్రి తెడ్ల చిన్న సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భార్య మరణించినప్పటి నుంచి చంద్రశేఖర్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఆమెతో గడిపిన జ్ఞాపకాలు, ఆమె లేని ఒంటరితనం ఆయనను కుంగదీశాయి. హనుమాన్ నగర్‌లో నివసిస్తున్న చంద్రశేఖర, భార్య మరణం తర్వాత తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. చివరకు భార్య మరణించిన ఐదు రోజులకే ఆమె వద్దకు వెళ్లిపోవాలని నిర్ణయించుకొని సీతంపేటలో ఆత్మహత్య చేసుకున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలిద్దరూ మరణించడంతో రెండు కుటుంబాలు కోలుకోలేని విషాదంలో మునిగిపోయాయి

# జీవన్ రెడ్డి నివాసంలో 'బ్రేక్ ఫాస్ట్' రాజకీయం

## మంత్రుల బుజ్జగింపులు ఫలించేనా?

**కరీంనగర్, మార్చి 21: పెన్ పవర్:** దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రను పోషించిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ ఫిరాయింపులు, వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రుల బృందం రంగంలోకి దిగింది. ఈ ఉదయం ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపును కూడా తిరస్కరించిన జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన ఇంటికి వెళ్లారు. మీడియాను లోపలికి అనుమతించకుండా, అల్పాహారం చేస్తూ సుమారు గంటన్నర పాటు జీవన్ రెడ్డితో వీరు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మంత్రుల బుజ్జగింపులు - తగ్గని జీవన్ రెడ్డి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనతో గంటల తరబడి చర్చలు జరిపారు. పార్టీలో మీ ప్రాధాన్యత తగ్గదు, తగిన గుర్తింపు ఇస్తాం అని మంత్రులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన మనసు మార్చుకోలేదని తెలుస్తోంది. తన సొంత కేడర్‌కు అన్యాయం జరుగుతున్నప్పుడు పదవుల్లో కొనసాగడం వృథా అని ఆయన మంత్రుల వద్ద కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీ నిష్ఫలమైందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు జీవన్ రెడ్డిపై కన్నేశాయి. అటు బీఆర్ఎస్ , ఇటు బీజేపీ ఆయనను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో జీవన్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారని, 25న రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ద్వారా గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డి సీనియారిటీని గౌరవించి, ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. బీజేపీ కూడా ఆయన వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో జీవన్ రెడ్డికి ఉన్న పట్టును గమనించి, ఆయనను తమ వైపు తిప్పుకుంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగుండదని కమలనాథులు భావిస్తున్నారు. మొత్తానికి జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు" అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మంత్రుల ముందే తన ఆవేదనను వెళ్లగక్కినట్లు సమాచారం. సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తూ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రులు ఎంత బతిమాలినా జీవన్ రెడ్డి మెత్తబడినట్లు కనిపించడం లేదని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ పార్టీని వీడాలని ఆయన ఇప్పటికే తన నిర్ణయాన్ని తీసేసుకున్నారని తెలుస్తోంది. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవులకు కూడా జీవన్ రెడ్డి రాజీనామా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఉగాది తర్వాత తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పిన ఆయన, బీఆర్ఎస్ వైపు వెళ్తారా? లేక స్వతంత్రంగా ఉంటారా? అనేది సస్పెన్స్‌గా మారింది.

# ఋతువులు పూర్వాపరాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** వివిధ కాలాలలో వాతావరణంలో ఏర్పడే మార్పులను బట్టి భారతా వనిలో సంవత్సరమును ఆరు ఋతువులుగా విభజించారు. రెండేసి నెలల చొప్పున వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమంతం, శిశిరం అని సంవత్సరకాలాన్ని ఆరు ఋతువులుగా విభజించారు.నిజానికి వేద వాఙ్మయంలో ప్రాచీనమైన ఋగ్వేదంలో ఆరు ఋతువుల ప్రస్తావన లేదు. ఋగ్వేదంలోని పదవ మండలం లోని పురుష సూక్తంలో ఋతువుల పేర్లు కనిపించే ఈ శ్లోకం చూడండి: "యత్ పురుషేణ హవిషా, దేవా యజ్ఞమతన్వత, వసంతో అస్యాసీద్ ఆజ్యం గ్రీష్మ ఇధ్మః శరద్ హవి" (ఋగ్వేదం10.90.6). పురుషుడే హవిస్సుగా దేవతలు చేసే సమస్త సృష్టి అనే యజ్ఞంలో వసంతం ఆజ్యం అయితే, గ్రీష్మం ఇంధనం, శరత్తు హవి. వసంతం, గ్రీష్మం, శరత్తు ఈ మూడు ఋతువుల పేర్లు తప్ప ఋగ్వేదంలో ఇతర ఋతువుల ప్రస్తావన కనిపించదు. కృష్ణ యజుర్వేదంలో కనిపించే ఈ కింది శ్లోకంలో పంచభూతాలవలే సంవత్సరంలో ఋతువులు కూడా అయిదు అన్న వివరణ కనిపిస్తుంది. "పంచ వా ఋతవః సంవత్సరస్ ఋతుష్వేవ సంవత్సరే ప్రతి తిష్ఠంతి" (యజుర్వేద 7.3.8). కృష్ణ యజుర్వేదానికే సంబంధించిన తైత్తిరీయ బ్రాహ్మణంలో అయిదు ఋతువుల వివరాలతో సంవత్సరాన్ని పక్షితో పోల్చుతూ చేసిన ఈ అందమైన వర్ణన ఉంది: "తస్య తే వసంతః శిరః; గ్రీష్మో దక్షిణః పక్షః ? వర్షాః పుచ్ఛం; శరద్ ఉత్తరః పక్షః; హేమంతో మధ్యం"? (తై. బ్రా. 3.10.4.1). సంవత్సర మనే పక్షికి వసంతం శిరస్సు అయితే, గ్రీష్మం కుడి రెక్క; వర్షం తోక; శరత్తు ఎడమ రెక్క; హేమంతం మధ్యభాగం. అంటే, ఋగ్వేదలోని మూడు ఋతువులకు వర్ష ఋతువు, హేమంత ఋతువు ఈ కాలానికి జత చేయ బడ్డాయి. ఆరు ఋతువుల ప్రస్తావన మనకు తెలిసినంత వరకూ తైత్తిరీయ సంహితంలో (తైత్తిరీయ సంహితం, తైత్తిరీయ బ్రాహ్మణం తరువాతి కాలంలో వెలువడింది) మొదటి సారి కనిపిస్తుంది. "మధుశ్చ మాధవశ్చ వాసంతికా వృతూ శుక్రశ్చ శుచిశ్చ గ్రైష్మా వృతూ నభశ్చ నభస్యశ్చ వార్షికా వృతూ ఇషశ్చోర్జశ్చ శారదా వృతూ సహశ్చ సహస్యశ్చ హైమంతికా వృతూ తపశ్చ తపస్యశ్చ శైశిరా వృతూ" (తైత్తిరీయ సంహత 4-4-11). మధు మాధవ మాసాలు వసంత ఋతువు. శుక్రము శుచి మాసాలు గ్రీష్మర్తువు. నభము, నభస్యము, వర్షర్తువు, ఇషము, ఊర్జము శరదృతువు. సహము, సహస్యము హైమంతిక ఋతువు. తపము, తపస్యము శైశిర ఋతువు. మనం ఇప్పుడు చెప్పుకొనే చైత్రం, వైశాఖం అన్న 12 మాసాల పేర్లు అప్పటికింకా ప్రాచుర్యంలోకి రాలేదు. వాటికి మారుగా, మధు, మాధవ, శుక్ర, శుచి, ఇషము, ఊర్జ, సహ, సహస్య, తప, తపస్య అన్న పేర్లు ఇక్కడ కనిపిస్తాయి. అయితే ఇప్పుడు వాడే చైత్రం, వైశాఖం అన్న పేర్లు నక్షత్రాలకు సంబంధించినవి. నక్షత్రాల ఆధారంగా చంద్రుని గమనాన్ని పరిశీలిస్తే చంద్రుడు ఒక నక్షత్ర కూటమి నుండి బయలు దేరి మళ్ళీ అదే నక్షత్ర కూటమిని చేరుకోవ డానికి దాదాపు 27రోజులు పడుతుందని తెలుస్తుంది. దీన్ని నాక్షత్రిక మాసం అంటారు. ఈ 27 రోజుల్లో చంద్రుడు దాటే ఒక్కొక్క నక్షత్ర కూటమికి ఒక్కో పేరు చొప్పున అశ్వని, భరణి మొదలైన 27 నక్షత్రాల పేర్లు ఏర్పాటు చేసారు. ఆపైన, ప్రతి మాసంలో నిండు పున్నమ నాడు చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రపు వృద్ధి రూపమే ఆ మాసానికి పేరుగా ఇవ్వడం మొదలు పెట్టారు. ఆ రకంగా చిత్త నక్షత్రంలో పౌర్ణమి వస్తే ఆ మాసం చైత్ర మాసంగా, అలాగే, విశాఖ నక్షత్రంలో పౌర్ణమి వస్తే వైశాఖంగా పిలువ బడింది. ఇదే విధంగా సూర్యునికి సంబంధించిన సంవత్సర కాలాన్ని 27 భాగాలుగా విభజన చేసి వాటిని కార్తెలు అని అన్నారు. ఒక్కో నక్షత్ర కూటమిలో సూర్యుడు దాదాపు 2 వారాల పాటు ఉంటాడు కాబట్టి ఒక్కో కార్తె సుమారుగా 13 రోజులు ఉంటుంది. అశ్వని కార్తె మొదలు రేవతీ కార్తె వరకూ సాగే ఈ కార్తెల విభజన వ్యవసాయ దారులకు చాలా ఉపయోగకరం. భారత దేశంలో ఆచరణలో ఉన్నవి ఆరు ఋతువులు.

సుమారు 20-30 డిగ్రీల ఉష్ణోగ్రత; చెట్లు చిగురించి పూవులు పూస్తాయి. వివాహాల కాలం ,ఉగాది, శ్రీరామ నవమి, వైశాఖి, హనుమజ్జయంతి; గ్రీష్మ ఋతువు: జ్యేష్టం, ఆషాఢం బాగా వేడిగా ఉండి 40 డిగ్రీల ఉష్ణోగ్రత, ఎండలు మెండుగా ఉంటాయి. వట పూర్ణిమ, రథాయాత్ర, గురు పూర్ణిమ; వర్ష ఋతువు: శ్రావణం, భాద్రపదం చాలా వేడిగా ఉండి అత్యధిక తేమ కలిగి భారీ వర్షాలు కురుస్తాయి. రక్షా బంధన్, శ్రీకృష్ణ జన్మాష్టమి,వినాయక చవితి, శరదృతువు: ఆశ్వయుజం, కార్తీకం. తక్కువ ఉష్ణోగ్రత, దసరా నవరాత్రి, విజయ దశమి, దీపావళి, శరద్ పూర్ణిమ బిహు, కార్తీక పౌర్ణమి; హేమంత ఋతువు: మార్గశిరం, పుష్యం. చాలా తక్కువ ఉష్ణోగ్రతలు (20-25) మంచు కురిసి, చల్లగా నుండు కాలము. పంటలు కోతల కాలం. భోగి, సంక్రాంతి, కనుమ; శిశిర ఋతువు: మాఘం, ఫాల్గుణం, బాగా చల్లని ఉష్ణోగ్రతలు, 10డిగ్రీల కంటె తక్కువ, ఆకురాల్చు కాలం, ఉగాది, వసంత పంచమి, రథసప్తమి/మకర సంక్రాంతి, శివరాత్రి, హోళీ.. భారతీయ పురాణాలలో, శరదృతువు సరస్వతి దేవతకి ఇష్టపడే కాలంగా పరిగణించ బడుతుంది, దీనిని "శరదృతువు దేవత" (శారద) అని కూడా పిలుస్తారు. అలంకార శాస్త్రం నిర్దేశించిన అష్టాదశ వర్ణనల్లో ఋతు వర్ణన ప్రధానమైనది కాబట్టి మన తెలుగు కావ్యాలలో కూడా సాంప్రదాయికంగా ఈ ఆరు ఋతువుల వర్ణనే కనిపిస్తుంది.

# నాటు కోళ్ల వ్యాపారి నుంచి టెకీ.. అంతర్జాతీయ ఢ మాఫియా వరకు.. మొయినాబాద్ కేసులో వీడని మిస్టరీ..



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తు మునుపెన్నడూ లేనంత వేగంగా పుంజుకుంది. ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఈ కేసులోని లోతుపాతులను తవ్వుతున్న కొద్దీ దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజకీయ నాయకులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల చుట్టూ ఈ కేసు అల్లుకుని ఉండటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనూ.. ప్రజల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.

**అభిషేక్ సింగ్ కస్టడీ.. విచారణలో కీలక ఆధారాలు**

ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని ముమ్మరంగా విచారిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వ్యక్తి డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌లో ఎలా కీలకంగా మారారనే కోణంలో అధికారులు ఆశ్చర్యపోతున్నారు. అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్ డేటా, కాల్ రికార్డులు, డిజిటల్ ట్రాన్సాక్షన్లను విశ్లేషించిన అధికారులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రైవర్, అభిషేక్ సింగ్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు పక్కా ఆధారాలు లభించాయి. కేవలం ఒకట్రెండు సార్లు మాత్రమే కాకుండా రోహిత్ రెడ్డికి కనీసం 24 సార్లు మత్తు పదార్థాలు సరఫరా అయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నాటు కోళ్ల వ్యాపారి 'సీన్'లోకి ఎలా వచ్చారు?**

ఈ కేసులో అత్యంత విచిత్రమైన, ఆసక్తికరమైన అంశం ఎం. రమేశ్ అనే నాటు కోళ్ల వ్యాపారి ప్రమేయం. ఫాంహౌస్ సమీపంలోనే నివసిస్తూ రియల్ ఎస్టేట్, కోళ్ల వ్యాపారం చేసుకునే రమేశ్, అనుకోకుండా ఈ ఉచ్చులో చిక్కుకున్నారు. "పెద్దసార్లు వస్తున్నారు.. మంచి నాటు కోళ్లు కావాలి" అంటూ రోహిత్ రెడ్డి అనుచరులు ఫోన్ చేయడంతో రమేశ్ అక్కడికి వెళ్లారు. అయితే దురదృష్టవశాత్తూ పార్టీ జరుగుతున్న సమయంలో అతను అక్కడే ఉండటంతో పోలీసులు అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. "నాకు డ్రగ్స్‌తో సంబంధం లేదు.. కేవలం కోళ్లు ఇవ్వడానికే వెళ్లాను" అని అతను మొరపెట్టుకుంటున్నప్పటికీ సిట్ అధికారులు అతని వాంగ్మూలాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు.

**అంతర్జాతీయ లింకులు.. దుబాయ్, ఢిల్లీకి సిట్ బృందాలు!**

కేసు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదని, దీనికి అంతర్జాతీయ మూలాలు ఉన్నాయని ప్రాథమిక ఆధారాలు చెబుతున్నాయి. నిందితుల ఫోన్లలోని సమాచారం ప్రకారం దుబాయ్ నెట్‌వర్క్‌తో వీరికి సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరెవరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీసేందుకు ప్రత్యేక బృందాలను దుబాయ్ మరియు ఢిల్లీకి పంపాలని సిట్ నిర్ణయించింది.

**ఆర్థిక లావాదేవీలపై నిఘా**

మరో నిందితుడు కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయాల గుట్టు రట్టవుతోంది. అభిషేక్ సింగ్ , కౌశిక్ రవి మధ్య జరిగిన తరచుగా జరిగిన సంభాషణలు డ్రగ్స్ సరఫరా చైన్‌ను స్పష్టం చేస్తున్నాయి. ఈ కేసులో ఉన్న 11 మంది నిందితుల బ్యాంక్ ఖాతాలను అధికారులు జల్లెడ పడుతున్నారు. భారీ ఎత్తున జరిగిన ఆర్థిక లావాదేవీలు ఎవరి ఖాతాల నుంచి ఎవరికి వెళ్లాయనేది తేలితే మరికొందరు 'పెద్దల' పేర్లు బయటపడే అవకాశం ఉంది.ప్రధాన నిందితులు రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, నమిత్ శర్మల కస్టడీ పిటిషన్‌పై ఉప్పర్‌పల్లి కోర్టు సోమవారం ఇచ్చే తీర్పు ఈ కేసులో అత్యంత కీలకం కానుంది. కోర్టు కస్టడీకి అనుమతిస్తే, సిట్ విచారణలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# కోమటిరెడ్డి ఎక్కడ? సినీ అవార్డులకు దూరం వెనుక కథేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒకటే చర్చ.. "మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎక్కడ?" ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'గద్దర్ సినీ అవార్డుల' వేడుకకు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి గైర్హాజరు కావడం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. సొంత శాఖకు సంబంధించిన మెగా ఈవెంట్, అది కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జరుగుతున్నా, కోమటిరెడ్డి దూరంగా ఉండటం వెనుక పెద్ద కథే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

**గద్దర్ అవార్డ్స్.. మంత్రి మిస్సింగ్.. అసలేం జరిగింది?**

ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో సినీ పురస్కారాలను ప్రకటించడం ప్రభుత్వానికి ఒక ప్రతిష్టాత్మక నిర్ణయం. రవీంద్ర భారతిలో జరిగిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. కానీ ప్రోటోకాల్ ప్రకారం వేదికపై ఉండాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి మాత్రం కనిపించలేదు. నగరంలోనే అందుబాటులో ఉండి కూడా ఆయన రాకపోవడం వెనుక "అలిగారా? లేక సైడ్ చేశారా?" అనే చర్చ మొదలైంది.

**ప్రాధాన్యత తగ్గడమే ప్రధాన కారణమా?**

కోమటిరెడ్డి అసంతృప్తికి ప్రధాన కారణం ఆహ్వాన పత్రికలో తన పేరుకు దక్కిన ప్రాధాన్యత అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తనను 'ముఖ్య అతిథి'గా కాకుండా కేవలం ఒక అతిథిగా పరిగణించడం ఆయనకు నచ్చలేదని సమాచారం. తన శాఖకు సంబంధించిన వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హవా ఎక్కువగా ఉండటం.. ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు సైతం తన కంటే భట్టితోనే ఎక్కువగా సంప్రదింపులు జరపడం కోమటిరెడ్డిని నొచ్చుకునేలా చేశాయని తెలుస్తోంది.

**శాఖపై పట్టు కోల్పోతున్నారా?**

ఇటీవలి కాలంలో సినిమాటోగ్రఫీ శాఖలో కోమటిరెడ్డి ప్రమేయం లేకుండానే కీలక నిర్ణయాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. పెద్ద సినిమాల టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోల అనుమతుల విషయంలో మంత్రి ప్రమేయం నామమాత్రంగా మారిందని చర్చ జరుగుతోంది. గతంలో ఒకానొక సందర్భంలో "నాకు తెలియకుండానే జీవోలు ఎలా వస్తున్నాయి?" అని మంత్రి స్వయంగా ప్రశ్నించడం ఆయన అసహనాన్ని బయటపెట్టింది. సినిమా రంగానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా పరిశ్రమ పెద్దలు మంత్రి దగ్గరికి కాకుండా నేరుగా సీఎంఓ లేదా డిప్యూటీ సీఎం వద్దకు వెళ్తుండటం ఆయనకు మింగుడుపడటం లేదని టాక్.



**వివాదాల సుడిగుండంలో ఆర్ అండ్ బీ శాఖ**

కేవలం సినిమాటోగ్రఫీ మాత్రమే కాదు.. కోమటిరెడ్డి వద్ద ఉన్న మరో కీలక శాఖ ఆర్ అండ్ బీ కూడా వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. ముఖ్యంగా 'హ్యామ్' రోడ్ల ప్రాజెక్టులలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు ఆయనకు తలనొప్పిగా మారాయి. తన శాఖపై జరుగుతున్న ఈ దాడిని పార్టీలో కొందరు నేతలు సమర్థవంతంగా తిప్పికొట్టడం లేదన్న అసంతృప్తి కూడా ఆయనలో ఉందట.

**భవిష్యత్తుపై అనిశ్చితి?**

ఒకప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లాలో తిరుగులేని నాయకుడిగా సీఎం రేసులో ఉన్న వ్యక్తిగా కోమటిరెడ్డికి పేరుండేది. కానీ ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే, ఆయన ప్రాధాన్యతను పార్టీ కావాలనే తగ్గిస్తోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి. రాబోయే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మార్పులు చేర్పులు ఉంటాయన్న వార్తల నేపథ్యంలో కోమటిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లడం రాజకీయంగా పెద్ద సంకేతాలనే ఇస్తోంది.మొత్తానికి గద్దర్ అవార్డుల వేడుకకు మంత్రి గైర్హాజరు కావడం అనేది కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం కాదు.. ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొన్న అంతర్గత విభేదాలకు, ఆధిపత్య పోరుకు నిదర్శనమని విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

# చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా..? రేవంత్ రెడ్డికి...

### చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో.. మూసీ బాధితురాలు

**హైదరాబాద్ మార్చ్ 21: పెన్ పవర్:** కాంగ్రెస్ సర్కారు మూసీ సుందరీకరణ పేరుతో చేస్తున్న దౌర్జన్యంపై మూసీ బాధితుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తాము ఎంతో కష్టపడి కట్టుకున్న ఇంటిని తొలిగిస్తామంటే ఊరుకునే లేదని స్పష్టం చ్హున్నారు. పిల్లలకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదంటూ ఓ తల్లి కన్నీరు మున్నీరైంది.మూసీ బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ.. అమ్మా రేపు మన ఇల్లు కూలగొడుతున్నారట కదా.. ఏంటీ మన పరిస్థితి అని అడుగుతుంటే.. ఏం చెప్పాలో అర్థం కావట్లేదు. నేను ఒకరికి ధైర్యం చెప్పాల్సింది పోయి.. నేను ధైర్యం కోల్పోతున్నాను. నాలాంటి పరిస్థితి ఎదుర్కోకండి. తల్లి తర్వాత ఇంకో తల్లిని తీసుకొస్తాను.. నష్టపరిహారం ఇస్తాను అంటే ఒప్పుకుంటారా..? ఈ తల్లి వద్దు నీకు వేరే తల్లిని తీసుకొస్తానంటే ఒప్పుకుంటారా..? కాదు కదా.. ఇది మా ఇల్లు.. కష్టపడి కట్టుకున్న ఇల్లు. డ్రీమ్ హౌస్ అని అంటం. దయచేసి మా కలను చెదర్చకండి.. మాకో విలువ ఉంది.. మమ్మల్ని గుర్తించండి.. ప్రతీ ఒక్కరికి చెప్పేదేంటంటే మమ్మల్ని కూడా ఇక్కడ ఉండనీయండి. ఎలాంటి నష్ట పరిహారం మాకొద్దు. ఇచ్చినా ఏవిధంగా ఇస్తరు..ఝ మా ఇంటిలో మేం ప్రశాంతంగా ఉండానుకుంటున్నాం.. మా జీవితాలతో గేమ్స్ ఆడకండి.. మీకు గేమ్స్ ఇష్టమోమో వేరే విధంగా ఆడుకోండి. దయ చేసి మా జీవితాలు కాపాడండి అంటూఓ మహిళ కన్నీరుమున్నీరైంది.రేవంత్ రెడ్డికి చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో అందుకే ఇలా చేస్తున్నాడు, మా దగ్గరికి రండి మా పిల్లలు చదువు చెప్తారని మండిపడ్డది. ఇలాంటి పనులు చేస్తే మా వాల్యూ కాదు రేవంత్ రెడ్డి వాల్యూ జీరో అవుతుంది. మీ తల్లిని తీసుకెళ్లి ఇంకొక తల్లిని ఇస్తామంటే ఊరుకుంటారా? మా ఇల్లు కూడా మాకు తల్లితో సమానమే.. దయచేసి మా జీవితాలతో ఆడుకోకండి ఇదేమన్న చాక్లెట్ ఆ లేక బిస్కెట్ ఆ అడగగానే ఇవ్వడానికి..కష్టపడి కట్టుకున్న ఇల్లు అని హెచ్చరించింది.ఒకరు వచ్చి హైదరాబాద్ సింగపూర్ చేస్తా అంటారు.. ఇంకొకరు మీ ఇల్లు కూలగొట్టి సుందరీకరణ చేస్తా అంటారు.. చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా? రేవంత్ రెడ్డి తెలంగాణ ఎకానమీ పెంచుతా అనడం పెద్ద జోక్ లాగా ఉంది, ఆయనకు ఎప్పుడూ ఆయన ఎకానమీ పెంచుకోవడం మీదనే ధ్యాస ఉందంటూ సదరు మూసీ బాధితురాలు తీవ్ర స్థాయిలో ఆరోపించింది.

# ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో లోపాల మీద లోపాలు

### లెక్చరర్లు పిల్లల్లా గుంపులు గుంపులుగా కూర్చుని పేపర్లు మూ ల్యాంకనం

**హైదరాబాద్ మార్చ్ 21: పెన్ పవర్:** ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో లోపాల మీద లోపాలు వెలుగు చూస్తున్నాయి. లెక్చరర్లు పిల్లల్లా గుంపులు గుంపులుగా కూర్చుని పేపర్లు మూ ల్యాంకనం చేస్తున్నారు. ఇంటర్ పరీక్షలు ముగియడం తో జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగుతున్న ది. పలు జిల్లాల్లో మూల్యాంకన క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపుల్లో సరైన వసతుల్లేవు. కనీసం కూర్చునేందుకు బెంచీలు(డ్యూయల్ డెస్క్) కూడా లేవు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మూల్యాంకన క్యాంపులో లెక్చరర్లు అంతా నేలమీదే కూర్చుని పేపర్లు దిద్దుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు లెక్చరర్లు కారిడార్, బాల్కనీల్లో గోడల మీద పేపర్లు పెట్టి మూల్యాంకనం చేస్తున్న చిత్రాలు సోషల్‌మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. శుక్రవారం కీలకమైన బాటనీ, జువాలజీ, కామర్స్ పేపర్లు వాల్యుయేషన్ చేయించగా అనేక లోపాలు వెలుగుచూశాయి.జవాబు పత్రాల మూల్యాంకనం గందరగోళంగా సాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో అధికారులు ఆటలు ఆడుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. హడావుడిగా వాల్యుయేషన్ చేయిస్తున్నారని, విచ్చలవిడితనానికి పరాకాష్టగా మారిందని అంటున్నారు. ఈ నెల 17 నుంచి అన్ని క్యాంపుల్లో 30 పేపర్లకు బదులు రోజుకు 45 పేపర్లు ఇస్తున్నారని మండిపడుతున్నారు.మూల్యాంకన కేంద్రాల్లో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. ఈ రోజు ఎంత మంది వస్తారు.. ఎన్ని బెంచీలు, కుర్చీలు అవసరమన్న అంశాలు పరిగణనలోకి తీసుకోకుండా ఏర్పాట్లు చేశారని చెప్తున్నారు. వసతులు సరిగ్గా లేకపోతే లెక్చరర్లు పేపర్లను సక్రమంగా మూల్యాంకనం చేయకపోతే దీని ప్రభావం ఫలితాల మీద పడుతుంది. పకడ్బందీగా పేపర్ల మూల్యాంకనం అంటే ఇదేనా..? అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విద్యార్థులు ఫెయిలైతే.. బాధ్యులెవరు అని నిలదీస్తున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం గర్హనీయమని మండిపడుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.


# రాష్ట్ర వార్షిక బడ్జెట్లోబ్రహ్మణులకు ప్రభుత్వం తీరని అన్యాయం

### బ్రహ్మణ పరిషత్ కు తక్షణమే ఐదువేల కోట్ల బడ్జెట్ ను కేటాయించాలి

### గోబల్ బ్రహ్మణ్ను వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

**హైదరాబాద్ మార్చ్ 21 పెన్ పవర్:** రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్లోబహ్మణులకు ప్రభుత్వంతీరని అన్యాయం చేసిందని గోబల్ బ్రహ్మణ్ను వెల్ఫేర్ అసోసియేషన్ గిరిప్రసాద్ శర్మ, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం ఆరోపించారు. శనివారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రహ్మణ పరిషత్ కు తక్షణమే ఐదువేల కోట్ల బడ్జెట్ ను కేటాయించాలని, గతంలో ఉన్న బకాయిలను వెంటనే లబ్దిదారుల ఖాతాలోకి జమా చేయాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బ్రహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసినప్పటికీ ఒక ఐఏఎస్ ను నియమించలేదని వెంటనే ఐఏఎస్ అధికారిణి నియమించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అధికారిగా కొనసాగిన శైలజ రామయ్య తమ కార్పొరేషన్ సంబందించిన ఒక ప్రకటనను ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఏర్పాటు చేసిన ఏ ఒక్క పథకంకు సైతం నిధులు ఇవ్వలేదని వారు మండిపడ్డారు బ్రహ్మణ సామాజిక వర్గంకు చెందిన మంత్రి ఉన్నప్పటికీ ఆయన పూజలు, పునస్కారాలు, సన్మాలు చేసుకోవడానికే పనికి వస్తున్నారనే తప్ప బ్రహ్మణులకు చేసింది ఏమిలేదని ఆరోపించారు.రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల బ్రహ్మణ కుటుంబాలు ఉన్నాయని పూజలు, పంచాగలతోనే కాలం వెల్లదీస్తు, ఇతర వర్గాలతో పోటీ పడాలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేసి బ్రహ్మణులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు బ్రహ్మణ కార్పొరేషన్ పేరు ప్రభుత్వానికి నచ్చకపోతే సోనియాగాంధీ బ్రహ్మణ కార్పొరేషన్ పెట్టుకున్న తమకు అభ్యంతరం లేదన్నారు. తమకు ప్రభుత్వంపై తమకు ఏలాంటి ద్వేషం లేదని తమను కాగితాలకే పరిమితంచేయకుండా చూడాలన్నారు. లేని యెడల బ్రహ్మణుల శాపాలకు గురికాకతప్పదని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో అసోసియేష్ ప్రతినిధులు పురుషోత్తంరావు, కోటేశ్వరరావు,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఇస్పెషల్ అదే.. తేల్చిన తాజా రిపోర్టు



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలోని వివిధ మహానగరాలను పోలుస్తూ వెల్లడైన రిపోర్టు ఒకటి హైదరాబాద్ మహానగర ప్రత్యేకతను వెల్లడించింది. ప్రాంతాలు.. మతాలు.. కులాలకు అతీతంగా ఎవరొచ్చినా సరే.. అక్కున చేర్చుకునే పెద్ద మనసు హైదరాబాద్ మహానగర ఇస్పెషల్ గా చెప్పాలి. ఉపాధి కోసం వచ్చే కడు బీదవారు మొదలు వందల కోట్లు పెట్టుబడులు పెట్టే సత్తా ఉన్న పెట్టుబడిదారుల వరకు అందిని అక్కున చేర్చుకోవటం హైదరాబాద్ ప్రత్యేకతగా చెప్పాలి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే.. హైదరాబాద్ లో అవకాశాలు.. సదుపాయాలు పుష్కలంగా ఉన్న విషయాన్ని అంతర్జాతీయ గణాంకసంస్థ నంబియో తన రిపోర్టులో వెల్లడించింది.ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ నగర జీవన వ్యయం తక్కువగా తేల్చింది. ఇంటి అద్దెను మినహాయిస్తే.. రూ.12వేలతో కూడా బతికేయొచ్చని వెల్లడించింది. ఈ నెలలో నుంబియో విడుదల చేసిన రిపోర్టు ప్రకారం దేశంలోని ఇతర ప్రధాన నగరాల జాబితాలో హైదరాబాద్ ఆరో స్థానంలో ఉంది. కొనుగోలు శక్తిలో మెట్రో నగరాల్లో అగ్రస్థానంలో నిలవటం విశేషం. ఇక్కడ సంపాదించే డబ్బులతో ఇతర నగరాల కంటే ఎక్కువ సౌకర్యాల్ని పొందే వీలుంది.జీవన వ్యయం విషయానికి వస్తే సగటున ఒక్కో మనిషికి రూ.31,808.. కుటుంబానికి రూ.1.14 లక్షలు ఖర్చు అవుతున్నట్లు పేర్కొంది. అద్దెల విషయానికి వస్తే బెంగళూరు కంటే 33 శాతం తక్కువగా తేల్చారు. ఈ లెక్కలకు బేస్ సిటీగా న్యూయార్క్ ను తీసుకున్నారు. అంటే.. ఆ మహానగరంలో జీవన వ్యయం ఇండెక్స్ ను 100గా తీసుకుంటారు.ఇతర నగరాల సూచీలను దాంతో పోల్చి లెక్కిస్తారు.నలుగురుకుటుంబ సభ్యుల సగటు ఖర్చులను పరిగణలోకి తీసుకొని స్కోర్ ఇస్తారు. ఆహారపదార్థాల నుంచి ప్రజా రవాణా.. విద్యుత్.. నీరు.. ఇంటర్నెట్.. దుస్తులు.. ఇలా ప్రతి ఉత్పత్తి ధరను వాటి బరువుతో గుణించి బాస్కెట్ కాస్ట్ ను నిర్ధారిస్తారు. ఇలా న్యూయార్క్ మహానగరంతో లెక్కించి చూసినప్పుడు హైదరాబాద్ మహానగరం అందరిని ఆకట్టుకోవటమే కాదు.. ఎవరినైనా అక్కున చేర్చుకోవటం భాగ్యనగరి ప్రత్యేకతగా చెప్పకతప్పదు.

## భార్య చనిపోయిందని ఎస్ఐ సూసైడ్



**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ యాదవ్ జమ్మికుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈనెల 17న ఆయన భార్య దివ్య కడుపునొప్పి భరించలేక గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకోగా, మనస్తాపానికి గురైన ఎస్సై సైతం ప్రాణాలు తీసుకున్నారు. వరుస మరణాలతో ఇద్దరు చిన్న పిల్లలు అనాథలయ్యారు. మృతదేహాన్ని జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతల తిరుగుబాటు

**హైదరాబాద్ పెన్ పవర్** హుజురాబాద్లో బీఆర్ఎస్ నేతల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కౌశిక్రెడ్డి వ్యవహారశైలిపై బీఆర్ఎస్ నేతల అసంతృప్తి బయటపడింది. 100 మంది నేతలు, కార్యకర్తల రహస్య సమావేశం నిర్వహించారు. పార్టీలో వన్ మెన్ షో చేస్తూ కేడర్ని పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. వ్యక్తిగత విషయాలను రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కౌశిక్రెడ్డి వైఖరిపై అధిష్టానానికి ఫిర్యాదు చేసే యోచనలో సీనియర్లు నేతలున్నారు. కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. మంత్రి సమక్షంలో కాంగ్రెస్ చేరే అవకాశం వుందని టాక్..

## గుడ్‌న్యూస్.. ఒకేసారి 3 నెలల రేషన్ పంపిణీ!

**హైదరాబాద్ పెన్ పవర్**పేద ప్రజలకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించింది.

రాష్ట్రాలకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రజలకు సౌలభ్యం కల్పించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

ఈ విధానంతో లబ్ధిదారులు తరచూ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. రాబోయే మూడు నెలలకు సరిపడే బియ్యం, గోధుమలు వంటి ధాన్యాలు ఒకేసారి అందజేయనున్నారు.

అదనంగా, ఈ కార్యక్రమాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

## తెలంగాణకు త్వరలో ప్రధాని మోదీ పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్**త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు రానున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో బీజేపీ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తోంది. పరేడ్ గ్రౌండ్‌లో సభ నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.



## ప్రాధాన్యం లేనప్పుడు పార్టీలో ఉండటం ఎందుకు: జీవన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పై అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బిఆర్ఎస్ లోకి జీవన్ రెడ్డి వెళ్తారంటూ ప్రచారం చేశారు. జీవన్ రెడ్డి ఇంటికి మంత్రి శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ వచ్చారు. జీవన్ రెడ్డిని శ్రీధర్ బాబు బుజ్జగించారు. జీవన్ రెడ్డితో గంటకు పైగా మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డిని కలవడానికి వచ్చామని, జీవన్ రెడ్డితో అనేక అంశాల గురించి చర్చించామని తెలిపారు. జీవన్ రెడ్డి పద్దతిగల నాయకుడిగా 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని కొనియాడారు. పార్టీ కార్యకర్తలు, నాయుకుల మనోభావాలను తెలియజేశారు. జీవన్ రెడ్డి ఆవేదనను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రులతో సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ మార్పుపై పట్టు వీడలేదని, ప్రాధాన్యం లేనప్పుడు పార్టీలో ఉండటం ఎందుకని ప్రశ్నించారు. మంత్రులు పార్టీలో కొనసాగాలని కోరారు. మీకో దండం అంటూ మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి ససేమిరా అని..తన నిర్ణయం లో మార్పులేదని, పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని జీవన్ రెడ్డి అన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మంచినీటి ఊటలు.. పర్యావరణహిత గ్లేసియర్స్

**హైదరాబాద్ పెన్ పవర్**జీవులకు ప్రాణాధారం జలం. భూగృహంపై జీవకోటి ఉనికికి కారణం ద్రవరూపంలో ఉన్న నీరు మాత్రమే. అతి ముఖ్య సార్వత్రిక ద్రావణిగా జలధారలు భూఉపరితలంపై నిరంతరం ప్రవహిస్తానే ఉన్నాయి. భూమిపై ఉన్న జల సంపదలో అత్యధిక మొత్తం సముద్ర జలం రూపంలో లేదా హిమానీనదాలు లేదా గ్లేసియర్స్ రూపంలో ఉండడంతో పాటు కేవలం 3 శాతం మాత్రమే మంచి నీటి జలంగా మానవాళికా అందుబాటులో ఉంటున్నది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన నీటి కొరత లేదా నీటి ఒత్తిడిని అనుభవిస్తున్నది. నేడు మార్కెట్‌లో నీటిని పాల వలె అధిక ధరలకు కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడింది. రానున్న కొన్ని దశాబ్దాల్లో నీటి కొరత ఎక్కువై దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండిపోయే ప్రమాదం కూడా ఏర్పడనుందని అర్థం అవుతున్నది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-6 ప్రకారం "2030 నాటికి అందరికీ నీరు - పారిశుద్ధ్యం" అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ - పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో ప్రపంచ మానవాళి నీటి ఒత్తిడి సంక్షోభంలో పడే విధంగా కనిపిస్తున్నది. తాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, జన విద్యుత్ కేంద్రాలు, ఉత్పత్తి రంగాలు జల వనరులను అత్యధికంగా వినియోగించుకుంటున్నాయి. ప్రాణికోటి మనుగడకు కారణమైన నీటి కొరతను అధిగమించడానికి ప్రజలకు నీటి ఆవశ్యకత పట్ల తగు అవగాహన పెంచాల్సిన అవసరం ఏర్పడుతున్నదని గమనించిన ఐరాస ప్రతి ఏట 22 మార్చిన "ప్రపంచ నీటి దినోత్సవం లేదా వరల్డ్ వాటర్ డే"ను 1993 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. నేటి పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు లేదా గ్లేసియర్లు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణ కేంద్రంగా నేటి మానవాళి తన దృష్టిని పెట్టవలసి ఉందనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని 2026 ప్రపంచ నీటి దినం ఇతివృత్తంగా "వాటర్ అండ్ జెండర్ - నీటి ప్రవాహంతో లింగ సమానత్వం" అనబడే అంశం కేంద్రంగా అవగాహన కలిపించడం జరుగుతున్నది. హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని "అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం"గా కూడా ప్రకటించు తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా ప్రప్రథమంగా 2025, మార్చి 21న "ప్రపంచ గ్లేసియర్స్ దినం" కూడా నిర్వహించడం జరిగింది. క్రియోస్ఫియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీనితో పాటు 2025-34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్ఫియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించడం జరిగింది. ఇదే క్రమంలో నీరు - పారిశుద్ధ్యాలకు సంబంధించిన నివేదికను "వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్" అనబడే పేరుతో విడుదల చేయడం జరిగింది.భూతాపం పెరిగిన కొద్ది హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీనదాలు కరిగితే వరదలు, కొండచరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గీగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్ర మట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపు చేయబడి ఉంటుందని తెలుసుకోవాలి. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నివేదిక "సహజ వనరుల కొరత" ఆధారంగా విడుదల చేయబడింది. రానున్న రోజుల్లో అతి ముఖ్యమైన కొరత ప్రమాదాల్లో 4వ స్థానం నీటి ఒత్తిడి గుర్తించబడింది. నీరు తాగడానికి, పారిశుద్ధ్యానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు మాత్రమే కాకుండా పర్యావరణ సమతుల్యత కాపాడడంలో కూడా ఉపయోగపడుతుంది. ప్రపంచ నీటి దినం వేదికగా నీటి వనరులను కాపాడడంతో పాటు హిమానీనదాల వేగవంతమైన కరగడాన్ని కూడా తగ్గించడానికి ప్రజలకు పలు మార్గాల్లో ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాల్సింది ఉన్నది. సహజ వనరైన నీటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నీటిని ఆదా చేస్తూ, హిమానీనదాలను రక్షించుకుంటూ రాబోయే తరాలకు సుజల వాతావరణం కల్పిద్దాం, నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకుందాం.

# శాస్త్రోత్తంగానే సీతారాముల కల్యాణం

**హైదరాబాద్ పెన్ పవర్**భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం కేవలం ఒక ధార్మిక వేడుక మాత్రమే కాదు, అది తరతరాల సంప్రదాయానికి, అచంచలమైన భక్తికి మరియు శాస్త్రబద్ధమైన ఆచారాలకు నిలువుటద్దం. ఇటీవలి కాలంలో ఈ మహోత్సవంలో పఠించే 'ప్రవర' విషయంలో తలెత్తిన చర్చలు కేవలం ఆధ్యాత్మిక పరిధులకే పరిమితం కాకుండా, న్యాయస్థానం వరకు చేరడం ఈ అంశం యొక్క గాంభీర్యాన్ని చాటిచెబుతోంది. భద్రాద్రి రాముడిని 'దశరథ తనయుడిగా' సంబోధించాలా లేక 'రామనారాయణుడిగా' కీర్తించాలా అనే ప్రశ్న చుట్టూ జరుగుతున్న ఈ మథనం, సంప్రదాయం మరియు అధికారిక నిర్ణయాల మధ్య ఉన్న ధర్మ సూక్ష్మాన్ని ఎత్తిచూపుతోంది. ఈ నెల 23న హైకోర్టులో జరగబోయే విచారణ, తదనంతరం 27న నిర్వహించ తలపెట్టిన కల్యాణోత్సవం నేపథ్యంలో, భక్తులలో నెలకొన్న ఉత్కంఠ, ఈ వివాదంలోని శాస్త్రీయ కోణాల గురించి తీవ్ర చర్చలు చోటుచేసుకుంటున్నాయి. తెలుగువారి ఆరాధ్య దైవం, మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు కొలువైన భద్రాచలం కేవలం ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు; అది తరతరాల భక్తి పరంపరకు, అచంచలమైన విశ్వాసానికి మరియు శాస్త్రబద్ధమైన ఆచారాలకు ఒక సజీవ సాక్ష్యం. ప్రతి ఏటా చైత్ర శుద్ధ నవమి నాడు భద్రాద్రిలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం లోకకల్యాణానికి ప్రతీకగా నిలుస్తుంది. అయితే, ఇటీవలి కాలంలో ఈ మహోత్సవంలో పఠించే 'ప్రవర' విషయంలో తలెత్తిన చర్చలు కేవలం ఆధ్యాత్మిక పరిధులకే పరిమితం కాకుండా, సామాజిక ఆందోళనకు మరియు న్యాయస్థాన విచారణకు దారితీశాయి. భద్రాద్రి రాముడిని 'దశరథ తనయుడిగా' సంబోధించాలా లేక 'రామనారాయణుడిగా' కీర్తించాలా అనే ప్రశ్న చుట్టూ జరుగుతున్న ఈ మథనం, ప్రాచీన సంప్రదాయాలకు మరియు ఆధునిక పాలనా నిర్ణయాలకు మధ్య ఉన్న ఒక సున్నితమైన ధర్మ సూక్ష్మాన్ని ఎత్తిచూపుతోంది. ఈ వివాదాన్ని లోతుగా విశ్లేషిస్తే, ఇందులో దాగి ఉన్న చారిత్రక సత్యాలు, ఆగమ శాస్త్ర రహస్యాలు మరియు భక్తుల భావోద్వేగాల మేళవింపు స్పష్టమవుతుంది.

భద్రాచలం క్షేత్ర చరిత్రను పరికిస్తే, ఇది 17వ శతాబ్దంలో భక్త రామదాసుగా ప్రసిద్ధి చెందిన కంచర్ల గోపన్న అకుంఠిత దీక్షతో రూపుదిద్దుకున్న అద్భుత ఆధ్యాత్మిక నిలయం. రామదాసు కాలం నుండి నేటి వరకు సీతారాముల కల్యాణం ఒక నిర్దిష్టమైన పద్ధతిలో, వాల్మీకి రామాయణోక్తమైన రీతిలో జరుగుతూ వస్తోంది. వైకుంఠ రాముడిగా, శంఖుచక్రాలతో వెలసిన ఈ స్వామికి కల్యాణం జరిపించే సమయంలో 'ప్రవర' పఠనం అత్యంత కీలకమైన ఘట్టం. హైందవ వివాహ సంప్రదాయంలో ప్రవర అంటే కేవలం వంశవృక్షం కాదు; అది వధూవరుల ఋషి పరంపరను, గోత్రాన్ని, వేద శాఖను మరియు వారి పూర్వీకుల ఘనతను ప్రకటించే ఒక పవిత్ర సంకల్పం. వివాహ వేదికపై వరుడు తన వంశ మూలాలను ప్రకటించడం ద్వారా ఆ సంస్కారానికి ఒక అధికారికత, శాస్త్రబద్ధత చేకూరుతుంది. భద్రాద్రి కల్యాణంలో రాముడి ప్రవరను పఠించేటప్పుడు ఆయనను సూర్యవంశ సంజాతుడిగా, ఇక్ష్వాకు వంశమణిగా, దశరథ మహారాజు కుమారుడిగా అభివర్ణించడం తరతరాలుగా వస్తున్న ఆచారం. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రవరలో 'రామనారాయణ' అనే పదప్రయోగాన్ని చేర్చడం వివాదానికి కేంద్రబిందువైంది. సంప్రదాయ పండితులు, ఆగమ శాస్త్ర నిపుణులు మరియు హిందూ సంఘాల వాదన ప్రకారం, శ్రీరాముడు విష్ణువు యొక్క అవతారమే అయినప్పటికీ, ఆయన 'నర' రూపంలో అవతరించిన పురుషోత్తముడు. రామాయణ అంతరార్థం ప్రకారం రాముడు తనను తాను ఒక సామాన్య మానవుడిగా (ఆత్మానం మానుషం మన్యే) భావించుకుంటూ ధర్మాన్ని ఆచరించి చూపారు. వివాహ సమయంలో వరుడు తన తండ్రి, తాతల పేర్లను చెప్పడం శాస్త్రం. రాముడు దశరథుని కుమారుడిగా భూమిపై జన్మించినప్పుడు, ఆయన వివాహ ప్రవరలో 'దశరథ తనయుడు' అని ఉండాలి తప్ప, దైవత్వపు 'నారాయణ' నామాన్ని చేర్చడం సంప్రదాయ విరుద్ధమని వారు గట్టిగా వాదిస్తున్నారు. ఒక పదం మారినా అది ఆ వివాహ సంస్కారంలోని భావాన్ని, ప్రాచీనతను దెబ్బతీస్తుందని, శతాబ్దాల నాటి రామదాసు సంప్రదాయాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

మరోవైపు, దేవాదాయ శాఖ అధికారులు మరియు కొందరు అధికారిక ఆగమ సలహాదారులు ఈ మార్పును సమర్థిస్తున్నారు. భద్రాద్రిలో వెలసిన స్వామి వైకుంఠ రాముడని, ఆయన చేతిలో శంఖుచక్రాలు ఉన్నాయని, కావున ఆయనను 'నారాయణ' స్వరూపంగా ప్రవరలో పేర్కొనడంలో తప్పేముందని వారు ప్రశ్నిస్తున్నారు. భక్తులకు పరమాత్మ యొక్క సర్వవ్యాపకత్వాన్ని తెలియజేయడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని వారి అభిప్రాయం. అయితే, ఈ వాదన పండిత లోకంలో ఆమోదం పొందడం లేదు. విగ్రహ స్వరూపం ఏదైనప్పటికీ, కల్యాణ ఘట్టం అనేది రామాయణ ఇతివృత్తం ఆధారంగా జరుగుతుందని, అక్కడ దశరథ తనయుడిగానే రాముడు ఉండాలని వారు గుర్తుచేస్తున్నారు. ఈ తర్క వితర్కాల మధ్య వివాదం ముదిరి, చివరకు న్యాయస్థానం మెట్లు ఎక్కడం గమనార్హం. ఈ వివాదంలో సామాజిక కోణాన్ని కూడా విస్మరించలేం. భద్రాచలం కల్యాణం అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. కోట్లాది మంది తెలుగువారు తమ ఇంట్లో జరుగుతున్న వేడుకగా దీనిని భావిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించే ఈ ఉత్సవంలో, అచారపరమైన లోపాలు దొర్లడం భక్తుల మనోభావాలను గాయపరుస్తోంది. సోషల్ మీడియా వేదికలపై భక్తులు ఈ అంశంపై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థానంలో మార్చి 23న జరగబోయే విచారణపై అందరి దృష్టి నెలకొంది. సంప్రదాయాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు ఇచ్చే తీర్పు, 27న జరిగే కల్యాణోత్సవంపై ప్రభావం చూపనుంది.

పాలనాపరమైన నిర్ణయాలు ధార్మిక ఆచారాల్లో జోక్యం చేసుకోకూడదని, ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని భక్తులు గుర్తుచేస్తున్నారు.

ప్రవర వివాదం కేవలం ఒక పేరు మార్పు మాత్రమే కాదు; అది మన సంస్కృతి యొక్క ప్రామాణికతను కాపాడుకోవడానికి జరుగుతున్న ఒక గొప్ప మథనం. సనాతన ధర్మంలో ప్రతి ఆచారం వెనుక ఒక శాస్త్రీయ కారణం ఉంటుంది. ఆ కారణాన్ని విస్మరించి, కాలానుగుణంగా లేదా స్వతంత్ర నిర్ణయాలతో మార్పులు చేస్తే, ఆచారాల పవిత్రత దెబ్బతింటుంది. ప్రభుత్వం నియమించిన పండిత కమిటీలు మరియు న్యాయస్థానం ఈ విషయంలో లోతైన అధ్యయనం చేసి, ప్రాచీన గ్రంథాల ఆధారంగా ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, శాస్త్రీయతను కాపాడుకోవడం ద్వారానే మన వారసత్వం చిరస్థాయిగా నిలుస్తుంది. ముగింపుగా, భద్రాద్రి రాముని కల్యాణం ఎప్పటిలాగే సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా జరిగి లోకానికి శాంతిని చేకూర్చాలని తెలుగు లోకం కోరుకుంటోంది. 'రామ' నామమే ఒక తారక మంత్రం; ఆ నామానికి మరే ఇతర విశేషణాలు అవసరం లేదు. భక్తుల విశ్వాసాన్ని గౌరవించి, శతాబ్దాల నాటి రామదాసు ఆచారాలను యథాతథంగా కొనసాగించడం ద్వారానే ఆ క్షేత్ర గౌరవం పెరుగుతుంది. న్యాయస్థానం వెలువరించే తీర్పు ధర్మానికి అనుగుణంగా ఉండాలని, భద్రాద్రి కల్యాణ వేదికపై దశరథ తనయుడైన ఆ రామచంద్రుని ప్రవర స్పష్టంగా, సంప్రదాయబద్ధంగా వినిపించాలని ఆశిద్దాం. అప్పుడే ఈ 'ప్రవర మథనం' సుఖాంతమై, భక్తి భావం వెల్లివిరుస్తుంది. రామదాసు కీర్తనలు ప్రతిధ్వనించే ఆ పుణ్యనేలపై, శాస్త్రం గెలవాలి, సంప్రదాయం నిలవాలి.

# మధ్యాహ్న భోజనంపై గరికపాటి షాకింగ్ కామెంట్స్.. విమర్శల వెల్లువ



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు ఉండరు. తన వాక్చాతుర్యంతో ధర్మం గురించి, సమాజం గురించి అద్భుతంగా వివరించే ఆయన, తాజాగా మధ్యాహ్న భోజనం పథకంపై చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. పేద విద్యార్థులకు పెట్టే ఆహారం, ఇచ్చే పుస్తకాలపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అసలు గరికపాటి ఏమన్నారు? ప్రజలు ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు? ఈ వివాదం వెనుక ఉన్న అసలు సంగతేంటో ఇప్పుడు చూద్దాం.

**వివాదానికి కేంద్ర బిందువైన వ్యాఖ్యలు:**

గరికపాటి గారు ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు అందించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. చదువుకోవాలనే కసి ఉన్న విద్యార్థి ఇంటి నుంచే అన్నం తెచ్చుకోవాలని, లేదంటే మానేయాలని ఆయన అనడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ముఖ్యంగా భోజనంలో గుడ్లు పెట్టడం వంటి నిర్ణయాలను "అర్థరహితం" అని కొట్టిపారేయడం, ప్రభుత్వం కేవలం విద్యాబోధనకే పరిమితం కావాలని సూచించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఇవన్నీ ఉచితంగా ఇస్తుంటే విద్యార్థులు "శోభనం గదిలో పెళ్లికొడుకుల్లా" తయారవుతారని ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు విమర్శల వెల్లువకు కారణమయ్యాయి.

**పేదరికం – పథకాల ఆవశ్యకత:**

మరోవైపు, సామాజిక విశ్లేషకులు మరియు సామాన్య ప్రజలు గరికపాటి మాటలను తప్పుబడుతున్నారు. భారతదేశం లాంటి దేశంలో పేదరికం కారణంగా ఎంతోమంది పిల్లలు బడికి వెళ్లలేని పరిస్థితి ఉంది. మధ్యాహ్న భోజనం అనేది కేవలం ఆకలి తీర్చడమే కాదు, అది అట్టడుగు వర్గాల పిల్లలను బడికి రప్పించే ఒక గొప్ప ప్రోత్సాహకం. పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్న పిల్లలకు గుడ్డు, పాలు ఇవ్వడం వల్ల వారి ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, వారు చదువుపై శ్రద్ధ పెట్టగలుగుతున్నారు. ఇక ప్రభుత్వం వేల కోట్లు ఇతర ఖర్చుల కోసం వెచ్చిస్తున్నప్పుడు, దేశ భవిష్యత్తు అయిన పిల్లల కోసం ఈ మాత్రం ఖర్చు చేయడంలో తప్పేముందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

**నైతికత మరియు సామాజిక బాధ్యత:**

గరికపాటి వంటి మేధావులు ధర్మం గురించి చెబుతున్నప్పుడు, ఆ ధర్మంలో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కూడా ఒక భాగమని గుర్తుంచుకోవాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఒక విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు కొనుక్కోలేని ఆర్థిక స్తోమత లేనప్పుడు, ప్రభుత్వం అండగా నిలవడమే కనీస బాధ్యత. కేవలం విద్యాబోధన చేస్తే సరిపోదని, చదువుకోవడానికి అవసరమైన కనీస వసతులు కల్పించినప్పుడే విద్య అందరికీ చేరువవుతుంది. ఇలాంటి సున్నితమైన విషయాలపై మాట్లాడేటప్పుడు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**మార్పు ఎక్కడ రావాలి?:**

గరికపాటి గారి ఉద్దేశం విద్యార్థులు కష్టపడాలనే తపనతో కూడుకున్నది కావొచ్చు, కానీ ఆయన వాడిన భాష మరియు పేదరికాన్ని తక్కువ చేసేలా ఉన్న విధానం చర్చనీయాంశమైంది. ఉచిత పథకాలు సోమరితనాన్ని పెంచుతాయనే వాదన ఒకెత్తయితే, కనీస అవసరాలు తీరనిదే జ్ఞాన సముపార్జన సాధ్యం కాదనేది మరో వాస్తవం. ఏది ఏమైనా, ఒక గొప్ప పండితుడి నోట నుంచి వచ్చిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సమాజంలో రెండు వేర్వేరు ఆలోచనా ధోరణులను సృష్టించాయి. ప్రభుత్వం మరియు సమాజం మధ్య సమన్వయం ఉన్నప్పుడే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

# ఆనం ఆపశోపాలు.. ఏం జరిగింది.. ?



**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం చంద్రబాబు టీంలో ఉన్న మంత్రుల్లో చాలా మంది యాక్టివ్‌గానే ఉన్నారు. అయితే.. దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనా రాయణరెడ్డి మాత్రం చాలా వరకు వెనుకబడ్డారనే టాక్ వినిపిస్తోంది. ఈయనది ఒక చోట కూర్చుని చేసే పనికాదు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలి. ఎక్కడ ఏ చిన్న తప్పు జరిగి నా.. అది సర్కారుకు బ్యాడ్ నేమ్ తెస్తుంది. దీంతో తరచుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి.. ఆయా ఆలయా లను దర్శించి.. మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుంది.కానీ.. జిల్లాల్లో పర్యటించే పరిస్థితి లేదని ఆనం చెబుతున్నారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశానికి కూడా ఆయన చాలా ఆలస్యంగా వచ్చారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో జరుగుతున్నపనులు, వస్తున్న ఫిర్యాదులపై సీఎం చంద్రబాబు ఆయనను ప్రశ్నించారు. దీనికి ఆయన ముక్తసరిగా సమాధానం చెప్పారు. తాను జిల్లాల్లో పర్యటించలేక పోతున్నానని ఆయన చెప్పినట్టు తెలిసింది. వయసు సహా.. ఆరోగ్య సమస్యలను ఆయన ప్రస్తావించారు.అంతేకాదు.. దేవదాయ శాఖ అంటే.. పని లేదని చాలా మంది అనుకుంటున్నారని.. కానీ, ఎక్కువ పని ఉండేది ఈ శాఖకేనని ఆయన చెప్పడం గమనార్హం. అంతేకాదు.. ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరచాల్సి ఉంటుందని కూడా వ్యాఖ్యానించారు. తనకు కొన్ని కొన్ని సందర్భాల్లో టెన్షన్ కూడా పెరుగుతోందన్నారు. ఇటీవల తిరుమల లడ్డూ విషయంపై వివాదం చెలరేగినప్పుడు.. ఆనం పెద్ద గా రియాక్ట్ కాలేదు. దీనికి కూడా ఆయన టెన్షనే కారణమని చెప్పినట్టు తెలిసింది.ఈ పరిణామాలతో సీఎం చంద్రబాబు ఆయనను ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మరో వైపు.. నియోజకవర్గంలో కూడా.. ఆనం పెద్దగా పర్యటించడం లేదు. ఆత్మకూరులోని నాలుగు మండలా లకు.. నలుగురు అనుచరులను పెట్టి .. వారి ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను అప్పుడప్పు డు వెళ్లి.. ఆయా కార్యక్రమాలను చక్కదిద్దుతున్నారు. ఇంతకు మించి.. ఆనం ఏమీ చేయడం లేదని తెలుస్తోంది. సో.. రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగితే.. ఆనంకు శాఖనైనా మార్చడమో.. లేదా తప్పించడమో తప్పదన్న వాదన వినిపిస్తోంది.

# జగన్ మౌనం: 'చెక్' పెట్టకపోతే చిక్కులే.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** మౌనం మంచిదే అయినా.. పుట్టి మునిగిపోతున్నా.. ఇంకా మౌనంగా ఉంటామంటే.. అది మొత్తానికే చేటు చేస్తుంది. ఈ విషయం వైసీపీ అధినేత జగన్‌కు తెలియంది కాదు. గత ఎన్నికలకు ముందు కూడా.. అప్పు లు.. మద్యం.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి విషయాలు దుమ్మురేపాయి. దీనికితోడు వివేకానంద రెడ్డి హత్య ( బాబాయ్–గొడ్డలి నినాదం), చెల్లెళ్ల శోకాలు.. ఆస్తుల పంపకాలు.. వంటివి ముసురుకున్నాయి. వీటికి తోడు.. కీలకమైన నాయకుల నియోజకవర్గాల మార్పు వంటివి కూడా ఆయనకు వ్యక్తిగతంగా ఇబ్బందులు తెచ్చాయి.

అయినప్పటికీ.. జగన్ నోరు విప్పేందుకు ముందుకు రాలేదు. అసలు ఏం జరిగింది? అనేది ఇప్పటికీ చెప్పలేదు. ఇక, ఇప్పుడు మరోసారి అటు తల్లి, ఇటు చెల్లి.. ఇద్దరూ తగులుకున్నారు. గతంలో చెల్లి తన కు అన్యాయం చేశారని చెప్పగా.. ఇప్పుడు తల్లి విజయమ్మ తెరమీదికి వచ్చారు. తన కుమార్తె పిల్లలకు.. జగన్ అన్యాయం చేశారని.. పిల్లల నోటి దగ్గర ముద్దను కూడా లాగేసుకున్నారని ఆమె వ్యాఖ్యానించారు. ఈ తరహా వ్యాఖ్యలు వేరే వారు చేస్తే.. ప్రభావం పెద్దగా ఉండేదికాదు.కానీ, స్వయంగా జగన్ మాతృమూర్తి బహిరంగ లేఖ రాయడంతోపాటు.. షర్మిలను వెనుకేసుకు రావడం.. అసలు ఆస్తులే పంపకాలు జరగలేదని చెప్పడం ఇప్పుడు సెంటిమెంటును మరింత పెంచేసింది. ఈ పరిణామాలకు తోడు.. పార్టీలోనూ అసంతృప్తులు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో కూడా జగన్ మౌనంగా ఉండడాన్ని ఆయనకు మద్దతుగా నిలిచే బూచేపల్లి కుటుంబం నుంచి రాచమల్లు కుటుంబం వరకు.. ఎవరూ హర్షించలేక పోతున్నారు.ఆస్తుల విషయంలో ఏం జరిగిందో .. జగన్ చెప్పేస్తే.. ఈ వేడి తగ్గుతుందని, లేదా.. ఏమైనా ఇవ్వాల్సింది ఉంటే ఇచ్చేస్తే ఈ రగడకు ఫుల్ స్టాప్ పడిపోతుందని అంటున్నారు. లేకపోతే.. ఎన్నికల వరకు ఈ వివాదాలు ఇలానే కొనసాగితే.. మరింత డ్యామేజీ తప్పదని వారు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో రాచమల్లు ప్రసాదరెడ్డి.. పార్టీ అధినేతకు అంతర్గత లేఖ రాసినట్టు తెలిసింది. ఏం జరిగిందో చెప్పేయాలని ఆయన తెలిపినట్టు సమాచారం. మరి ఇప్పటికైనా జగన్ నోరు విప్పుతారో లేదో చూడాలి.

# పుట్టా విషయంలో బాబు ఆ పని చేస్తారా...?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్.. డ్రగ్స్ కేసులో పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీడీపీ అధిష్టానం ఆయన నుంచి వివరణ కోరింది. దీనికిగాను ఐదు రోజుల సమయం ఇచ్చింది. ఈ గడువు ముగియడంతో పుట్టా.. తాజాగా తన వివరణను పార్టీ ఏపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావుకు అందించారు. దీనిలో ఏముంది.. అనేది పెద్దగా సందేహమేమీ లేదు. దీనిపై పెద్దగా ఎవరికీ ఉత్కంఠ కూడా లేదు. ఈ కేసు బయట పడినప్పటి నుంచి పుట్టా చేస్తున్న వాదన ప్రకారం.. ఈ కేసుతో తనకు సంబంధం లేదని.. తనకు ఎలాంటి అలవాట్లు లేవని.. చెబుతున్నారు. బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తన చిరకాల మిత్రుడని.. అందుకే ఆయన పిలిస్తే డిన్నర్ పార్టీకి వెళ్లానని అంటున్నారు. దీనికి సంబం ధించి ఆయన రెండు సార్లు తన వివరణను బహిరంగంగానే వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలకు కూడా సెల్ఫీ వీడియో ద్వారా వివరించారు. సో.. ఇప్పుడు కూడా అదే వివరణను పార్టీకి ఇచ్చి ఉంటారు. దీనిలో ఎలాంటి సందేహం లేదు. అయితే.. ఇప్పుడు చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకుంటారు ? అనేది ప్రశ్న. ఎందుకంటే.. పార్టీలో ఇంత పెద్ద సమస్యల్లో చిక్కుకున్నవారు లేకున్నప్పటికీ.. తరచుగావివాదాలకు కేంద్రంగా మారుతున్న నాయకులు ఉన్నారు. అలాంటి వారు.. తమపై చర్యలకు అధిష్టానం సిద్ధమవుతుందన్న బెంగ వెంటాడుతోంది. ఇలాంటి సమయంలో పుట్టా వ్యవహారం వచ్చే సరికి.. పార్టీలో ఆసక్తిగా మారింది. వాస్తవానికి ప్రతిపక్షం కంటే సొంత పార్టీలోనే పుట్టాపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న విషయంపై ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది. కానీ, చంద్రబాబుకు ఈ విషయం మింగుడు పడని వ్యవహారంగా మారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతోపాటు.. యువ నేత అనే ట్యాగ్ కూడా ఉంది. మరీ ముఖ్యంగా పార్టీకి సుదీర్ఘ సేవలందిస్తున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకు స్వయానా అల్లుడు కావడంతోపాటు.. పార్టీకి కీలకమైన పుట్టా సుధాకర్ తనయుడు కూడా కావడంతో ఎలాంటి చర్యలు తీసుకున్నా.. అది దీర్ఘకాలిక ప్రభావం చూపించే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే.. కొన్నాళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు మాత్రమే చంద్రబాబు మొగ్గు చూపుతారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆ తర్వాత.. ఈ కేసు పరిణామాలను బట్టి.. ఆయనను చేరదీయ వచ్చని తెలుస్తోంది. ఏదే మైనా.. బలమైన, భయంకరమైన చర్యలను ఊహించలేమని పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం.

# తిరుమల పూర్తిగా మారిపోతుందా..? ప్రసాదాలు, దర్శనాలపై కీలక మార్పులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల సన్నిధిలో ప్రసాదాల నాణ్యత, దర్శన సమయాల పర్యవేక్షణ విషయంలో కీలక అడుగు పడింది. ప్రసాదాల నాణ్యత పరీక్షించేందుకు అత్యాధునిక వాటర్ – ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అదేసమయంలో దర్శన సమయంలో జాప్యాన్ని నివారించేందుకు ూ× ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (×జజజ) ఏర్పాటు చేశారు. ఈ రెండింటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తిరుమల అధికారులకు కీలక సూచనలు చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో రసాయనాలతో తయారు చేసిన నెయ్యి వాడకం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం తిరుమలలో ఆత్యాధునిక వాటర్–ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. భక్తుల నమ్మకాన్ని కాపాడటమే కాకుండా నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో తిరుమలలో ఫుడ్ సేఫ్టీపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.25 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ను శనివారం ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి లోకేశ్ కుమారుడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి కుటుంబం తిరుమలకు వచ్చింది. ఈ సందర్భంగా ఫుడ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.ఫుడ్ ల్యాబ్ ప్రారంభం తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, భక్తుల నమ్మకానికి చిన్నపాటి విఘాతం కూడా వాటిల్లకూడదని అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని, తాగునీటిని అందించేందుకు టెక్నాలజీని వినియోగిస్తూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కలియుగ వైకుంఠం తిరుమలకు వచ్చే కోట్లాది మంది భక్తుల నమ్మకం, విశ్వాసాలను మరింత పెంచేలా... ఆరోగ్య భద్రతే ధ్యేయంగా టీటీడీ మరో చారిత్రాత్మక అడుగు వేసిందని కొనియాడారు.స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఖీూూూ×) సంయుక్తంగా టీటీడీ సహకారంతో రూ.25 కోట్ల వ్యయంతో అత్యాధునిక వాటర్ – ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. దేశంలోనే ఒక ఆలయం కోసం ఏర్పాటు చేసిన మొట్టమొదటి అత్యున్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్ ఇదేనని ప్రభుత్వం తెలిపింది. ల్యాబ్ ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్ పనితీరు, సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల నాణ్యతను ఏ స్థాయిలో విశ్లేషించవచ్చని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కెమికల్, మైక్రోబయాలజీ విభాగాలుగా దీనిని నిర్మించారు. ఇందులో ఈ–టంగ్, ఈ–నోస్, వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇవి ఆహార పదార్థాల రుచి, వాసనను డిజిటల్ పద్ధతిలో ఖచ్చితంగా విశ్లేషించగలవని అధికారులు సీఎంకు వివరించారు. 1981లో నీటి పరీక్షల కోసం చిన్నదిగా ప్రారంభమైన ఈ విభాగం, ఇప్పుడు నెలకు 1,000 నుంచి 1,500 శాంపిళ్లను విశ్లేషించే స్థాయికి చేరడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

**తిరుమలలో ల్యాబ్ దేశానికే ఆదర్శం**

బ్యాక్టీరియా గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్లీన్ రూమ్, ఎయిర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ వంటి భద్రతా ప్రమాణాలను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. శ్రీవారి ప్రసాదాల పట్ల భక్తులకు ఉన్న అపారమైన నమ్మకాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. కేవలం ల్యాబ్ పరీక్షలకే పరిమితం కాకుండా, అన్నప్రసాద కేంద్రాల్లోని వంటశాలల శుభ్రతపై నిరంతర తనిఖీలు నిర్వహించి పరిశుభ్రతను నిర్ధారించాలని ఆదేశించారు. టీటీడీ తీసుకున్న ఈ చర్యలు శ్రీవారి ప్రసాదాల పట్ల మరింత నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం సందర్శన**

భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శన భాగ్యం కలిగేందుకు, రద్దీ నియంత్రణ కోసం తీసుకువచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. భక్తులకు వేగంగా శ్రీవారి దర్శనం జరిగేలా ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని సీఎం సూచించారు. ప్రపంచంలోనే ఎక్కువ మంది భక్తులు దర్శించే పుణ్య క్షేత్రం కావడంతో జనసాంద్రత, దర్శన–సమయాలను సమర్థంగా నిర్వహించేలా కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు సీఎం వెల్లడించారు. AI ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC) ద్వారా జనసాంద్రత, దర్శనం కొసం వేచి ఉండే సమయం, వాహన చలనం, వసతి, సీసీటీవీ వాతావరణం, వైద్య అత్యవసరాలు అన్నీ ఒకే ప్లాట్‌ఫారం ద్వారా రియల్ టైమ్‌లో పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. AI-ఆధారిత విశ్లేషణ ద్వారా రద్దీ పెరిగే పరిస్థితులను ముందే అంచనా వేసి క్యూ మేనేజ్మెంట్ సమర్థంగా నిర్వహించేందుకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. ఐటీ శాఖ మంత్రి లోకేష్ చొరవతో టీటీడీలో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు అయిందని అంటున్నారు. దేశంలోని ఇతర ప్రముఖ ఆలయాలకు ఈ కేంద్రం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## హర్మ్యూజ్ జలసంధిలో చిక్కుకున్న రెండు భారతీయ ట్యాంకర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు భారత వంటింటిపై నేరుగా ప్రభావం చూపేలా ఉన్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొనడంతో, భారత్‌కు వంటగ్యాస్ (ఎల్‌పీజీ) తీసుకువస్తున్న రెండు భారీ ట్యాంకర్లు సముద్ర మార్గంలో నిలిచిపోయాయి. ఈ పరిణామంతో దేశంలో ఎల్‌పీజీ సరఫరాపై ఆందోళనలు మొదలయ్యాయి. ఖతార్ నుంచి ఎల్‌పీజీ లోడ్ చేసుకుని 'మహానది', 'నర్మద' అనే రెండు భారతీయ నౌకలు స్వదేశానికి బయలుదేరాయి. అయితే, హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ క్షిపణులతో, అమెరికా యుద్ధనౌకలతో పహారా కాస్తుండటంతో ఈ మార్గంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో నౌకల కెప్టెన్లు ముందుజాగ్రత్త చర్యగా ఒమన్ తీరంలోని సురక్షిత ప్రాంతంలో ట్యాంకర్లను నిలిపివేసి, ఉద్రిక్తతలు తగ్గే వరకు వేచి చూస్తున్నారు. ఫిబ్రవరి 28న ఈ ప్రాంతంలో ఘర్షణలు మొదలైనప్పటి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత్ తన ఎల్‌పీజీ అవసరాలలో సింహభాగం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఇప్పుడు ఈ సరఫరా గొలుసుకు ఆటంకం కలగడంతో, దేశీయంగా వంటగ్యాస్ కొరత ఏర్పడి ధరలు అమాంతం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అధికంగా ఉండటంతో, ఈ రవాణా సమస్య సామాన్యుడిపై మరింత భారం మోపనుంది. ఈ పరిస్థితిని భారత విదేశాంగ, నౌకాయాన మంత్రిత్వ శాఖలు నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో గస్తీ కాస్తున్న భారత నౌకాదళం అవసరమైతే రంగంలోకి దిగడానికి సిద్ధమవుతోంది. భారత యుద్ధనౌకల రక్షణతో ఈ ట్యాంకర్లను సురక్షితంగా జలసంధి దాటించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

## ఇరాన్ రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశాం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణ ముగింపు దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీశామని, ఆ దేశాన్ని కోలుకోలేని విధంగా నిర్వీర్యం చేశామని ఆయన ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే సంకేతాలను ఈ ప్రకటన ఇచ్చింది.తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ క్షిపణి వ్యవస్థను, వైమానిక, నౌకా దళాలను నామరూపాలు లేకుండా చేశామని తెలిపారు. ఉగ్రవాద ముప్పుగా మారిన ఇరాన్ రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామని, దీనివల్ల పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలకు అమెరికా అండగా నిలిచిందని గుర్తుచేశారు.ఇదే సమయంలో, ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మ్యూజ్ జలసంధి భద్రత విషయంలో ట్రంప్ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. ఇకపై ఆ జలసంధి భద్రత అమెరికా బాధ్యత కాదని తేల్చిచెప్పారు. "ఆ మార్గాన్ని అమెరికా ఉపయోగించదు. కాబట్టి దాని ద్వారా లబ్ధి పొందుతున్న దేశాలే తమ భద్రతను చూసుకోవాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అవసరమైతే సహాయం అందిస్తామని, కానీ ఇరాన్ ముప్పు తొలగిపోయినందున అది సాధారణ సైనిక చర్యగానే ఉంటుందని వివరించారు. ట్రంప్ వ్యాఖ్యలు పశ్చిమాసియా నుంచి అమెరికా తన సైనిక బలగాలను తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తోందన్న సంకేతాలిస్తున్నాయి. భద్రతా భారాన్ని మిత్రదేశాలకు బదిలీ చేసే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా, అణ్వాయుధాల తయారీ దిశగా ఇరాన్ ప్రయత్నిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని ట్రంప్ హెచ్చరించారు.

## అమెరికా యుద్ధ విమానాల ల్యాండింగ్‌కు శ్రీలంక నిరాకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఇరాన్‌పై యుద్ధోన్మాదంతో అమానవీయ దాడులకు తెగబడుతున్న అమెరికా ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని శ్రీలంక తేల్చి చెప్పింది. ఇరాన్‌పై దాడుల సమయంలో తమ భూభాగంలో రెండు యుద్ధ విమానాలు ల్యాండింగ్ చేసేందుకు అమెరికా ఒత్తిడి చేసిందని, అయితే తాము అందుకు అనుమతివ్వలేదని శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకె తెలిపారు. ఈ మేరకు పార్లమెంటు సమావేశాల్లో శుక్రవారం నాడు ఆయన ఒక ప్రకటన చేశారు. డిజ్‌బౌటి నుండి వస్తున్న అమెరికా యుద్ధ విమానాలు మార్చి 4, 8 తేదీల్లో శ్రీలంకలోని ఆగేయ మట్టాలా అంతర్జాతీయ విమానాశ్రయంలో అనుమతి కోరాయని, కానీ ఆ రెండు అభ్యర్థన లను తిరస్కరించామని ఆయన చెప్పారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా తటస్థంగా వుండాలనే భావిస్తున్నామని పేర్కొన్నారు. ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పశ్చిమాసియా యుద్ధం అనేక సవాళ్ళను విసురుతోందని, కానీ తాము ఎటువైపు మొగ్గకుండా తటస్థంగా వుండేందుకు గల అవకాశాలన్నీ ఉపయోగించుకుం టున్నామని దిసనాయకె చెప్పారు. దక్షిణ, సెంట్రల్ ఆసియా వ్యవహారాలకు అమెరికా ప్రత్యేక దూత సెర్గియో గోర్‌తో సమా వేశం జరిగిన మరుసటి రోజు దిసనాయకె ప్రకటన వెలువడింది. కీలకమైన సముద్ర మార్గాలను, పోర్టులను పరిరక్షించడంతో సహా పరస్పర లాభదాయకమైన వాణిజ్య సంబంధాలను అమలు చేయడం, ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛగా, బహిరంగంగా వుంచేలా చూడడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలపై ఇరువురు నేతలు చర్చించారని ఆ ప్రకటన వెలువడింది.

## యుద్ధం నీడలో రంజాన్ వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా అంతటా దాడులు, ప్రతిదాడులతో ఉద్రిక్తంగా ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో పవిత్ర రంజాన్ వేడుకలు జరిగాయి. ఘర్షణలు, బాంబుల మోతలతో శిథిలాల మధ్యే రంజాన్ (ఈద్ అల్-ఫితర్) జరుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అనేక దేశాల్లో భక్తులు ప్రార్థనల కోసం పెద్ద మసీదులకు చేరుకోగా, పాలస్తీనాలోని గాజాలో కుటుంబాలు తమ చుట్టూ విధ్వంసం ఉన్నప్పటికీ, వీధులను, తాత్కాలిక ఆశ్రయాలను పండుగ ప్రదేశాలుగా మార్చుకున్నారు. సాంప్రదాయకంగా కుటుంబంతో కలిసి విహారయాత్రలకు, కొత్త బట్టలకు సమయమైన ఈద్ పండుగ పశ్చిమాసియా దేశాల్లో వీధులో, శిథిలాల్లో ప్రార్థనలకే పరిమితమైంది. పండుగ వాతావరణం కనబడకుండా అశాంతితో నిండిపోయింది. ఇజ్రాయిల్ ఆక్రమిత తూర్పు జెరూసలేంలో అల్-అక్సా మసీదు మూసివేయడంతో పాలస్తీనియన్లు పాత నగరం గోడల వెలుపల ప్రార్థనలు చేశారు. బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడుల కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలు వీధి గుడారాలలో ఈద్ పండుగను జరుపుకున్నారు. భారత్, శ్రీలంక వంటి దేశాల్లో రంజాన్ పండుగను శనివారం జరుపుకోనుండగా, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలతోపాటు మధ్య ఆసియా, ఆగేయా సియా, ఆఫ్రికాల్లోని దేశాల్లో శుక్రవారమే ముస్లిములు రంజాన్ పండుగ నిర్వహించుకున్నారు. రంజాన్ నెలలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉపవాస దీక్షలను శుక్రవారం నాడు పవిత్ర ప్రార్థనలతో ముస్లిం సోదరులు విరమించారు. ఈ వేడుక రెండు రోజుల పాటు కొనసాగుతుంది.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని



**హైదరాబాద్ పెన్ పవర్:** నేడు రంజాన్ పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ పండుగ జరుపుకుంటున్న ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోడీలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నలువైపులా సోదరభావం, దయ వెల్లివిరవాలని ఆకాంక్షించారు. 'ఈద్ ఉల్-ఫితర్ శుభాకాంక్షలు. ఈరోజు నలువైపులా సోదరభావం, దయ మరింత పెంపొందాలి. అందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలి. ఈద్ ముబారక్ అని మోడీ ఎక్స్ పోస్టులో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడానికి, దేశ పురోగతికి దోహదపడటానికి అందరూ సంకల్పం తీసుకోవాలని ఈసందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసం ముగిసిన తర్వాత జరుపుకునే ఈ పండుగ ఆత్మనిగ్రహం, దానధర్మాలు, నిరుపేదల పట్ల కరుణ అనే సందేశాన్ని ఇస్తుంది. అలాగే ఇది ప్రేమ, సోదరభావం, శాంతి, పరస్పర సామరస్యం అనే సందేశాన్ని కూడా తెలియజేస్తుందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

కాగా, రంజాన్ పండుగ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. 'మీకు, మీ ప్రియమైన వారికి ఆనందం, శ్రేయస్సు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షిస్తున్నాను' సోషల్‌మీడియాలో వీడియో పోస్టు ద్వారా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ఈ పవిత్ర మాసంలో పెంపొందించుకున్న కరుణ, ఉదారత, ఐక్యత వంటి విలువలను వేడుకగా జరుపుకునే సందర్భమని అబ్దుల్లా అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. తాము ముస్లింలకు ఎప్పుడూ అండగా నిలుస్తామని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇస్లాం ప్రజలకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొచ్చినప్పుడల్లా, మేము ప్రజా వేదికలోనూ పార్లమెంటులోనూ వాటికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నాము అని స్టాలిన్ అన్నారు. బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధ్యక్షురాలు మాయావతి శనివారం ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రాజ్యాంగం హామీ ఇచ్చిన స్వేచ్ఛ వారికి దక్కాలని ఆకాంక్షించారు.

# కిమ్ జోంగ్ అన్ కుమార్తె ట్యాంకర్ షికారం పత్రికా కథ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ మరియు కుమార్తె కిమ్ జూయే మరోసారి అంతర్జాతీయ వార్తల్లో నిలిచారు. ఇటీవల, సైనిక విన్యాసాల్లో ఆమె ట్యాంకర్ నడిపిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి, ఇవి చర్చనీయాంశంగా మారాయి.సియోల్ నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, తండ్రి పర్యవేక్షణలో జరిగిన ఈ సైనిక శిక్షణలో కిమ్ జూయే ట్యాంకర్‌ను నడిపి, భవిష్యత్ వారసురాలిగా ఆమెను తయారు చేస్తున్నారన్న ఊహాగానాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఉత్తర కొరియా అధికారిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం, కిమ్ జోంగ్ ఉన్ సైనిక ట్యాంకర్ దళాలు, సైనికులతో కూడిన వ్యూహాత్మక విన్యాసాలను పర్యవేక్షించి, యుద్ధ సన్నద్ధతను పెంచాలని సైన్యానికి సూచించాడు.విడుదలైన వీడియోలు, ఫొటోలలో కిమ్ జూయే ఆకుపచ్చ రంగు ట్యాంకర్ డ్రైవర్ హ్యాచ్ నుంచి బయటకు చూసి వాహనాన్ని నడుపుతూ, తండ్రి దగ్గర కూర్చుని చిరునవ్వు కనబరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విపులంగా పంచబడుతున్నాయి.సుమారు 13 సంవత్సరాల వయస్సు గల కిమ్ జూయే, 2022 చివరి నుండి తండ్రితో కలిసి ముఖ్య సైనిక, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఉత్తర కొరియా మీడియా ఆమెను అత్యంత ప్రియమైన, గౌరవనీయమైన సంతానంగా వివరిస్తూ, తండ్రితో ఉన్న సాన్నిహిత్యాన్ని చూపే దృశ్యాలను తరచుగా ప్రసారం చేస్తోంది. ఇటీవల ఒక ఆయుధ తయారీ కేంద్రాన్ని సందర్శించినప్పుడు తుపాకీ కాల్పులు, రాకెట్ ప్రయోగాల పరిశీలనలు కూడా ఆమెకి అంకితం అయ్యాయి.గత సెప్టెంబర్‌లో బీజింగ్ పర్యటనలో తండ్రిని అనుసరించి ఆమె పాల్గొంది. నూతన సంవత్సర వేడుకల్లో కిమ్ జూయే తండ్రికి చెంపపై ముద్దు పెట్టిన దృశ్యాలు కూడా ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి. దక్షిణ కొరియా గూఢచారి సంస్థ అంచనా వేస్తున్నది, కిమ్ జోంగ్ ఉన్ కుమార్తెను భవిష్యత్ వారసురాలిగా నిర్ణయించే దిశగా అడుగులు వేస్తున్నారని. అయితే, ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనను చేసిన.

# యుఎన్ఐపై ఢిల్లీ పోలీసుల దాడి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ వార్తా సంస్థ యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యుఎన్ఐ) కార్యాలయంపై ఢిల్లీ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. పారామిలిటరీ బలగాలతో ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా బలవంతంగా ఖాళీ చేయించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై చేయిచేసుకున్నారు. వారిని బలవంతంగా బయటకు నెట్టేశారు. మహిళా జర్నలిస్టులపట్ల కూడా అభ్యంతరకరంగా వ్యవహరించారు. రాత్రి పొద్దుపోయిన తరువాత అకస్మాత్తుగా కొంతమంది ప్రభుత్వ అధికారులు, ఢిల్లీ పోలీసులు, వందల మంది పారామిలిటరీ బలగాలు, అధికారులు ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఉద్యోగులను వెంటనే న్యూస్‌రూమ్‌ను ఖాళీ చేసి ప్రాంగణం నుండి బయటకు వెళ్లమని ఒత్తిడి చేశారు.

ఉద్యోగులు స్వచ్ఛందంగా బయటకు వెళ్లకపోతే బలప్రయోగం చేయాల్సి వస్తుందని వారు బెదిరించారు. ఈ సంఘటన కలకలం రేపింది. యాజమాన్యానికి తెలపాలని, వారు వచ్చేంత వరకు ఆగాలని, ఆ మేరకు కొంత సమయం కావాలని ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు అడిగినా వినిపించుకోకుండా పోలీసులు వ్యవహరించిన తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ దాదాపు 40 ఏళ్ల క్రితం రఫీ మార్గ్?లో స్థలం కేటాయించిందని, అప్పటి నుండి నిబంధనల మేరకు భవనాన్ని నిర్మించడంలో ఆ సంస్థ విఫలమైందని పోలీసు అధికారులు చెబుతున్నారు. దీనిపై భూమి అభివృద్ధి అధికారులు హైకోర్టును ఆశ్రయించారని, కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఖాళీ చేయిస్తున్నామని చెబుతూ వారు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారు. నోటీసు చూపించాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదు. ఉద్యోగులను బలవంతంగా బయటకు గెంటివేసి, కార్యాలయాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# జమ్ముకాశ్మీర్‌లో ఖాకీ జులుం



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో చేపట్టిన జన్ ఆక్రోష్ నిరసన ప్రదర్శనలు శుక్రవారం కూడా కొనసాగాయి. పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో ఉధృతంగా జరిగాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మోడీ సర్కార్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకాశ్మీర్‌లో శాంతియుతంగా నిర్వహిస్తున్న జాతాపై పోలీసులు జులుం ప్రదర్శించారు. శ్రమజీవులు, అన్నదాతలపై లాఠీఛార్జి జరిపారు. ర్యాలీలో ఉన్నవారితో పాటు సాధారణ పౌరులు కూడా పోలీసుల దాడిలో గాయపడ్డారు. షోపియాన్‌లో సభ శాంతియుతంగా జరుగుతుండగా పోలీసులు విరుచుకుపడ్డారు. స్థానిక కార్మిక, రైతు సంఘాల నాయకుల ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాష్టీక చర్యలను సిపిఎం జమ్ముకాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జన్ ఆక్రోశ్ ర్యాలీపై పోలీసులు దాడి చేయడాన్ని సిపిఎం సీనియర్ నాయకులు మహ్మద్ యూసుఫ్ తరిగామి తీవ్రంగా ఖండించారు. ఆయన ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో లెఫ్టినెంట్ గవర్నరు కార్యాలయాన్ని ట్యాగ్ చేస్తూ.. పోలీసులపై చర్యలకు డిమాండ్ చేశారు. పోలీసుల చర్య ప్రజాస్వామ్య స్వేచ్ఛపై జరిగిన దాడిగా తరిగామి పేర్కొన్నారు. ఇలాంటి దాడులు చట్టబద్ధపాలనను మరింతగా దిగజారుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను కోరారు.

## ఇరాన్‌తో యుద్ధంలో యూఎస్‌కు నష్టం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు వైమానిక నష్టం గణనీయంగా నమోదైనట్టు బ్లూమ్‌బర్గ్ నివేదిక పేర్కొంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధంలో అమెరికా కనీసం 16 యుద్ధ విమానాలను కోల్పోయిందని వివరించింది. వీటిలో పది ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు కూల్చివేయబడ్డాయని పేర్కొంది. మిగిలిన నష్టాల్లో కొన్ని ప్రమాదాల వల్ల జరిగాయి. ముఖ్యంగా కువైట్‌లో మూడు ఎఫ్-15 ఫైటర్ జెట్లు 'ఫ్రెండ్లీ ఫైర్' వల్ల కూలిపోయాయి. అలాగే, ఒక కెసి-135 రీఫ్యూయలింగ్ ట్యాంకర్ గగనతలంలో జరిగిన ఆపరేషన్‌లో కుప్పకూలి, అందులో ఉన్న ఆరుగురు సిబ్బంది మృతి చెందిన విషయం విదితమే. ఇక సౌదీ అరేబియాలోని ఒక ఎయిర్‌బేస్‌పై ఇరాన్ క్షిపణి దాడి కారణంగా మరో ఐదు కెసి-135 విమానాలు దెబ్బతిన్నాయి. జోర్డాన్‌లోని ఒక ఎయిర్‌ఫీల్డ్‌పై జరిగిన బాలిస్టిక్ క్షిపణి దాడిలో మరో డ్రోన్ నేల పైనే ధ్వంసమైంది. అమెరికా యుద్ధ వ్యూహంలో డ్రోన్ల వినియోగం ఎక్కవగా ఉండటం, ఇవి తక్కువ ఖర్చుతో ఉండడం వల్ల అధిక ప్రమాద ప్రాంతాల్లో ఉపయోగిస్తారు. అందుకే డ్రోన్ల నష్టం ఎక్కువగా కనిపిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. యుద్ధ ప్రారంభదశలోనే అమెరికా విపరీతంగా వైమానిక దాడులు నిర్వహించడం వల్ల ఈ నష్టాలు పెరిగాయని నిపుణులు వివరిస్తున్నారు. ఇది గల్ఫ్ యుద్ధం ప్రారంభదశ కంటే కూడా ఎక్కువ స్థాయిలో ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంలో అమెరికా ఇంకా విజయవంతం కాలేకపోయింది. ఇటీవల ఒక ఎఫ్-35 ఫైటర్ జెట్‌పై ఇరాన్ కాల్పులు జరపడంతో అది అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది.

# జ్యోతిష్యం:ఇంపార్టెంట్ వర్క్..ఏ రోజు బయటకు వెళ్లాలి.. ఇవి ఎదురు వచ్చాయా..మీకు తిరుగుండదు.!




చాలా మంది ఎప్పుడు ఏ పనిపై ఎక్కడకు వెళ్లినా కలిసిరాదు.. కొంతమందికి వెళ్లడంతోనే వెళ్లిన పని చాలా సులువుగా అవుతుంది. కొంతమందికి అనేక అడ్డంకులు ఏర్పడుతాయి.. బయటకు వెళ్లేటప్పుడు ముహూర్తం అవసరమా.. ఏ రోజు ఏ దిక్కున వెళితే తల పెట్టిన పని పూర్తవుతుంది. ఎప్పుడు ప్రయాణిస్తే మనకు శుభం జరుగుతుంది. రాహుకాలం.. యమగండంలో వర్జ్యం.. దుర్మూహూర్తంలో పని ప్రారంభిస్తే ఏమవుతుంది.. పండితులు ఏమంటున్నారు...మొదలగు విషయాలనుఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

పండితులు తెలిపిన వివరాల ప్రకారం .. శుక్లపక్షములో విదియ, తదియ, పంచమి, సప్తమి, దశమి తిథులు. అశ్వని, మృగశిర, పునర్వసు, పుష్యమి, హస్త, అనూరాధ, మూల, శ్రవణం, ధనిష్ఠ, రేవతి నక్షత్రములు మంచివి. బహుళ పక్షములో కూడా ప్రయాణం చేయుటకు ఈ ప్రకారం పాటించవలయును. రాహుకాలం, గుళిక కాలం, యమగండ కాలం, వర్జ్యం విషయములో కూడా మంచిది కాదని పండితులు చెబుతున్నారు.పెద్దలు అనుభవంతో వ్రాసిన దుర్మూహూర్త కాలమును ప్రతిరోజు ఆచరించాలి. ప్రతిరోజు అమృతగడియలలో ప్రయాణం చేయవచ్చును. బయటకు వెళ్ళవచ్చును. తూర్పు ప్రయాణం చేయవలయును అనుకుంటే వారము, లగ్నం పాటించాలి. మీరు తీర్థయాత్రలు చేయవలెను అనుకుంటే ముహూర్తబలంతో వెళితే ప్రయాణంలో ఎలాంటి ప్రమాదములు జరగకుండా క్షేమంగా తిరిగి వస్తారు. ఈ విధంగా ఎనిమిది దిక్కులకు ప్రయాణం చేయాలి అంటే ఆలోచన చేసి వెళుృట మంచిదని జ్యోతిష్య నిపుణులు అంటున్నారు.

నవమి ఆదివారం పడమర దిక్కు వెళ్ళటం మంచిది కాదు. ఏకాదశి సోమవారం, పంచమి మంగళవారం, తదియ బుధవారం, షష్ఠి గురువారం, అష్టమి శుక్రవారం, ద్వాదశి శనివారం ఉన్న రోజులలో ప్రయాణం చేయరాదు. అనేక విధములుగా కష్టనష్టములు కలుగుటకు అవకాశములుండును. చెడు రోజులు ఎవరికి వారు తెలుసుకొని ఆచరించండి. ఆనందంగా ప్రయాణం చేయండి, క్షేమంగా తిరిగిరండి.

**ప్రయాణమునకు మంచి శకునములు**

ముత్తైదువ స్త్రీ, వేశ్య, కన్య, పెండ్లి ఊరేగింపు, ఇద్దరు బ్రాహ్మణులు, మంగళమగు ఊరేగింపు, పండ్లు, పువ్వులు, ఛత్రము, చామరము, గుఱ్ఱము, ఏనుగు, పూర్ణకుంభము, చెరుకు, పాలు, పెరుగు, క్యారేజి, ఆవు, కల్లుకుండ, తేనె, వస్త్రవ్యాపారి, తెల్లని వస్తువులు, చల్లనిగాలి, వృషభము మొదలగునవి మనకు ఎదురు వచ్చిన చాలా మంచిదని పండితులు చెబుతున్నారు.

# వాస్తుశాస్త్రం : కృత యుగం నుంచి కీలక పాత్ర .. అందరూ కచ్చితంగా పాటించాల్సిందే.. లేకపోతే కష్టాలే..!




మానవ జీవితంలో వాస్తుశాస్త్రం ఆచరణీయమైన పరిజ్ఞానంగా కలిసిపోయింది. కృతయుగం నుండి కలియుగం వరకు అన్ని యుగాలలోనూ ఈ శాస్త్రం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో కొంతమంది మాత్రమే ఈ వాస్తుశాస్త్రం ప్రయోజనాలను పొందారు. ఇప్పుడు అందరికీ అందుబాటులో వాస్తుశాస్త్రం ఉపయోగపడుతుంది. వాస్తను కచ్చితంగా అందరూ పాటించాల్సిందే.. లేకపోతే ఇబ్బందులు వస్తాయని పండితులు చెబుతున్నారు..వాస్తుశాస్త్రం యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన జీవనం కొరకు గృహం నిర్మించుకోవడానికి ఈ శాస్త్రం ఉద్దేశింపబడినది. తూర్పుదిక్కున వాస్తు శాస్త్రం ప్రకారం అన్ని రకాలుగా బాగున్నది. వాస్తు దోషం లేని ఇల్లు కట్టుకుంటే అది కొందరికి మాత్రమే కలిసివస్తుంది.

ఉత్తర ముఖంగా ఇల్లు కట్టుకుంటే వాస్తుప్రకారం ఏ రకమైనటువంటి లోపం లేకున్నా కొంతమందికి కలిసి వస్తుంది, కొంతమందికి కలిసిరాదు. దక్షిణ ముఖంగా ఇల్లు కట్టుకుంటే కొంతమంది ఇబ్బంది పడతారు, మరికొంతమంది విశేషమైన అసైశ్వర్యాలను, అధికారాన్ని, అత్యున్నతమైన విద్యను పేరు ప్రతిష్ఠలను సంపాదించుకోగలుగుతారు. అదేవిధంగా పడమటదిక్కున వాస్తుదోషం లేకుండా ఇల్లు కట్టుకుంటే కొంతమందికి బాగా కలిసివస్తుంది. కొంతమంది సర్వం కోల్పోతారు. వాస్తు బాగా ఉన్నటువంటి పరిస్థితిలో కొంత మందికి కలిసిరావడం, కలిసిరాక పోవడానికి కారణం ఏమిటి? వాస్తుప్రకారం కట్టినటువంటి ఇల్లు ఏ దిక్కున ఉన్నా యజమాని జాతకానికి అది సరిపోవాలి. అప్పుడు వాస్తు శాస్త్రం యొక్క ముఖ్యమైన ఉద్దేశ్యం కార్యరూపం దాలుస్తుంది. ప్రధానంగా ఏ దిక్కున ఇల్లు కట్టుకున్నా, ఏ రకమైనటువంటి శాస్త్రం వీధిపోటు ఉన్నా, ఏ దిక్కులోనైనా హెచ్చుతగ్గులు ఉంటే వాస్తుశాస్త్ర సంబంధ మైనటువంటి దుష్పలితాలు వర్తించవు. ప్రధానంగా జాతకం బాగుండాలి. ఆ జాతకానికి ఆ ఇంటి వాస్తుకి, దిక్కుకి సరిపోతే అదృష్ట వంతమైన రోజులు, అనుకూలమైన రోజులు సంప్రాప్తిస్తాయి. అన్నివిధాలుగా అభివృద్ధి సాధించగలుగుతారు. ఏది ఏమైనా ప్రధానమైన విషయం ఏమిటంటే జాతకానికి, వాస్తుకి పొంతన సరిపోవాలి, గ్రహగతులు, వాస్తు స్థితిగతులు ఒకే నాణానికి ఇరువైపుల వంటివి. వీటిని పరిగణలోకి తీసుకోకుండా చేసే పనులు అంతగా కలిసిరావు. పడమర నైఋతి వీధిపోటు తప్ప మిగిలిన అన్నిరకాల వీధిపోట్లు కలిసివస్తాయి.

ఈశాన్యంలో ఈశ్వరుడు ఉంటాడని, ఈశాన్య దిక్కుకి ఈశ్వరుడు అధిపతి అని కొంతమంది చెబుతుంటారు. దిక్పాలకుల్లో ఒక్కడైనటువంటి ఈశాన్యుడు వేరు, పరమేశ్వరుడు వేరు. పరమేశ్వరుడు సమస్త లోకాలు అధిపతి. ఆయన సంకల్పంతోనే సమస్త లోకాలకు సంచరిస్తుంటాయి. మహాదేవుణ్ణి ఈశాన్య దిక్కుకి పరిమితం చేయడం ధర్మశాస్త్రరీత్యా ఆ క్షేపణీయమైనది. ఏదిఏమైనా మీ జాతకం ప్రకారం, లగ్నం ప్రకారం, మీకు నడుస్తున్న దశ ప్రకారం వాస్తుశాస్త్రం మీకు ఉపయోగపడుతుంది..

# రంజాన్ రోజున తగ్గిన బంగారం, వెండి.. తెలుగు రాష్ట్రాల్లో కొత్త రేట్లు ఇవే..




అమెరికా డాలర్ విలువ పెరగడం, ముడిచమురు ధరలు భారీగా పెరిగిపోవడంతో మళ్లీ ధరలు పెరుగుతాయన్న ఆందోళన మొదలైంది. దింతో గత వారం ప్రపంచ మార్కెట్‌లో బంగారం అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. ఫలితంగా బంగారం ధరలు బాగా తగ్గుముఖం పట్టాయి.

అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం మొదలైన సమయంలో వీజశ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,60,000 వరకు వెళ్లింది. గత వారం భారీగా పడిపోయిన బంగారం ధర, చివరకు 10 గ్రాములకు రూ.1,44,825 వద్ద నిలిచింది. బంగారం ధరలు తగ్గడం వల్ల కొనుగోలుదారులకు ఇది కొంత ఊరట కలిగించే విషయమనే చెప్పాలి.

ఈ రోజు (మార్చ్ 21) 24క్యారెట్ల బంగారం 1గ్రాము ధర కాస్త తగ్గి రూ.14,890 ఉండగా, 22క్యారెట్ల బంగారం ధర రూ.13,654, 18క్యారెట్ల బంగారం ధర రూ.11,172. దింతో 10 గ్రాముల 24క్యారెట్ల ధర రూ.10 తగ్గి రూ.1,48,900, 22క్యారెట్ల ధర రూ.1,36,540, 18క్యారెట్ల ధర రూ.1,11,720.

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మంలో 10 గ్రాముల 24క్యారెట్ల బంగారం ధర రూ.1,48,900, 22క్యారెట్ల ధర రూ.1,36,540, 18క్యారెట్ల ధర రూ.1,11,720

విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24క్యారెట్ల బంగారం ధర రూ.1,48,900, 22క్యారెట్ల ధర రూ.1,36,540, 18 క్యారెట్ల ధర రూ.1,11,720 ఇక వెండి గ్రాము ధర రూ.254.90 ఉండగా.. కిలోకి రూ.100 తగ్గి రూ.2,54,900 చేరింది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర చూస్తే రూ.2,59,900 వద్ద ఉంది.

**బంగారం, చమురు ధరలపై ప్రభావం**

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, పశ్చిమ ఆసియాలో జరుగుతున్న దాడుల ప్రభావం రోజురోజుకి వేడెక్కుతున్నాయి. ఇరాన్‌లోని 'సౌత్ పార్స్' గ్యాస్ నిలయాలపై ఇజ్రాయెల్ దాడులు చేయడం, దానికి ప్రతికారంగా ఇరాన్ కూడా ఇతర గల్ఫ్ దేశాల్లోని చమురు కేంద్రాలపై దాడులు చేసే అవకాశం ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు మొదలయ్యాయి.

ఈ గొడవల వల్ల పెట్రోల్, డీజిల్ (ముడిచమురు) సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయంతో వాటి ధరలు భారీగా పెరుగుతున్నాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయి. దీనివల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరిగి, సామాన్యుడిపై భారం పడే ప్రమాదం ఉంది.

# జూన్ నెల కోటా దర్శన టికెట్లు రిలీజ్



తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. జూన్ నెల దర్శన టికెట్లు, గదుల వివరాలను టీటీడీ వెల్లడించింది. తిరుమల శ్రీవారి ఆర్జిత , సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవకు సంబంధించిన జూన్ నెల కోటాను మార్చి 20 న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేసింది.

**ఏ టికెట్లు ఎపుడంటే..?**

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను (21న) మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను మార్చి 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

# వీళ్లకు మానవత్వం ఉండదా?

## సమోసాల తయారీ ఇంత దారుణమా?




సమయం ఏదైనా సమోసా కనిపించినంతనే తినేద్దామన్న ఫీలింగ్ కలిగించటంలో దీని లెక్కే వేరుగా ఉంటుంది. అందునా హైదరాబాద్ మహానగరంలో గల్లీకో సమోసా షాప్ ఉండటం తెలిసిందే. కల్తీ దుర్మార్గం సమోసా లాంటి స్నాక్స్ విషయంలోనూ ఉండటం షాకింగ్ గా మారింది. ఇప్పటివరకు కల్తీ పాలు.. పన్నీర్.. అల్లంవెల్లుల్లి పేస్ట్.. మోతీచూర్ లడ్డూ.. ఇలా ప్రతి దానిని కల్తీగా మార్చేసి దుర్మార్గం.. ఇప్పుడు సమోసాకు మినహాయింపు కాదన్న విషయం తేలింది. ఒక మసోసా తయారీ కేంద్రంపై కుల్సుంపురా పోలీసులు దాడి చేయగా.. షాకింగ్ వాస్తవాలు వెలుగు చూశాయిఇక్కడి సమోసా తయారీ ఎంత అరాచకంగా ఉంటుందన్నది చూసిన తర్వాత సమోసాను తినాలనే ఆలోచనే చచ్చిపోయేలా ఉండటం గమనార్హం. ఈ సమోసా తయారీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు..కల్తీ నూనె.. పిండి.. ఇది అది అన్న తేడా లేకుండా అన్ని కల్తీ ముడిపదార్థాలతో తయారు చేసే తీరు చూస్తే నోట మాట రాదంతే. గోల్కొండకు చెందిన 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ జియాగూడ బైపాస్ రోడ్డులో మూసీ తీరంలో సమోసా తయారీని ఒక షెడ్డులో నిర్వహిస్తుంటాడు. వాటిని పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు.. బేకరీలు.. చిరు వ్యాపారులకు అమ్ముతుంటాడు.

యజమాని రషీద్ తో పాటు మరో ఐదారుగురు పని చేస్తుంటారు. ఇక్కడ తయారు చేసే సమోసాలకు మంచి ఆదరణ ఉందని చెబుతున్నా.. ఇక్కడ ఫుడ్ సేఫ్టీకి సంబంధించి ఎలాంటి నిబంధనలు పాటించని తీరు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. అంతేకాదు.. ఈ తయారీ కేంద్రానికి ప్రభుత్వ అనుమతులు కూడా లేకపోవటం గమనార్హం. పూర్తిగా నేలపై అపరిశుభ్ర వాతావరణంలో కుళ్లిన కోడిగుడ్లు..కాలం చెల్లిన కల్తీ మైదా.. కల్తీ వంట నూనెలతో పాటు కుళ్లిన కూరగాయాల్ని వినియోగిస్తూ తయారు చేసే సమోసా.. ఎంతటి అనారోగ్యానికి గురి చేస్తుందో ఆలోచించేందుకు సైతం భయం వేస్తుంది. ఈ ఉదంతం గురించి తెలిసిన తర్వాత సమోసాను అంత తేలిగ్గా తినే సాహసం చేయరని చెప్పకతప్పదు.

# కోట్లాది ఐఫోన్ యూజర్లకు 'డార్క్‌స్వోర్డ్' ముప్పు

ఐఫోన్ అంటే అత్యంత భద్రమైన ఫోన్ అనే నమ్మకానికి గట్టి దెబ్బ తగిలింది. 'డార్క్‌స్వోర్డ్' అనే అత్యంత ప్రమాదకరమైన స్పైవేర్ ఇప్పుడు ఐఫోన్ వినియోగదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కోట్లాది ఐఫోన్లను ఇది క్షణాల్లో హ్యాక్ చేయగలదని గూగుల్ సహా పలు సైబర్ భద్రతా సంస్థల పరిశోధనలో వెల్లడైంది.సాధారణంగా ఏదైనా లింక్‌పై క్లిక్ చేస్తే మాల్‌వేర్ వస్తుందని భావిస్తాం. కానీ ఈ స్పైవేర్ మరింత తెలివిగా పనిచేస్తోంది. ప్రభుత్వ లేదా ఇతర నమ్మకమైన వెబ్‌సైట్లను సందర్శించినప్పుడు, వాటిలో హ్యాకర్లు ముందుగా చొప్పించిన కోడ్ ద్వారా ఇది నేరుగా ఫోన్‌లోకి ప్రవేశిస్తుంది. ఒక్కసారి ఫోన్‌లోకి చేరితే ఫొటోలు, వ్యక్తిగత మెసేజ్‌లు, చివరికి క్రిప్టోకరెన్సీ వాలెట్లను సైతం ఖాళీ చేసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సౌదీ అరేబియా, ఉక్రెయిన్ వంటి దేశాల్లోని ప్రముఖుల డేటా చోరీకి దీనిని ఉపయోగించినట్లు గుర్తించారు.ముఖ్యంగా పాత ఆపరేటింగ్ సిస్టమ్‌లు వాడుతున్న ఐఫోన్లకు ఈ 'డార్క్‌స్వోర్డ్' స్పైవేర్ నుంచి ముప్పు ఎక్కువగా ఉంది. ఊూా 18, అంతకంటే పాత వెర్షన్లపై ఇది సులభంగా దాడి చేయగలదని తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఫోన్లలో దాదాపు 25 శాతం ఫోన్లు ఇప్పటికీ పాత సాఫ్ట్‌వేర్‌తోనే నడుస్తున్నాయని, వారందరూ హ్యాకర్ల బారిన పడే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి.ఐఫోన్ భద్రతను హ్యాకర్లు సవాల్ చేయడం ఇది మొదటిసారి కాదు. గతంలో 'ఎయిర్‌ప్లే' ఫీచర్‌లోని లోపాలను, యూఎస్‌బీ కనెక్షన్లను ఆసరాగా చేసుకొని కూడా హ్యాకింగ్ ప్రయత్నాలు జరిగాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన 'డార్క్‌స్వోర్డ్', 'కరోనా' వంటి స్పైవేర్లు ఈ ముప్పును మరింత తీవ్రతరం చేశాయి. ఈ నేపథ్యంలో తమ ఐఫోన్‌లోని విలువైన సమాచారాన్ని కాపాడుకోవాలంటే, వినియోగదారులు వెంటనే తమ ఫోన్ సాఫ్ట్‌వేర్‌ను లేటెస్ట్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవడం ఒక్కటే మార్గమని సైబర్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## టైం అయిపోతోందని ఫాస్ట్‌గా తినేస్తున్నారా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనకు దేనికీ తీరిక ఉండటం లేదు. కనీసం ప్రశాంతంగా కూర్చుని భోజనం చేయడానికి కూడా సమయం కేటాయించ లేకపోతున్నాం. ఆఫీసు పనుల ఒత్తిడిలోనో లేదా టీవీ, ఫోన్లు చూస్తూనో ఆహారాన్ని నమలడం మానేసి నేరుగా మింగేస్తుంటాం. పది నిమిషాల్లో ముగించాల్సిన భోజనాన్ని రెండు నిమిషాల్లోనే లాగించేస్తున్నాం. ఇలా వేగంగా తినడం వల్ల మనకు తెలియకుండానే అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నాం. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని మన పెద్దలు చెబుతుంటారు. ఆహారాన్ని గౌరవించి, నిమ్మళంగా నమిలి తినడం వల్ల ఆ శక్తి మన శరీరానికి పూర్తి స్థాయిలో అందుతుంది. కానీ ఈ 'ఫాస్ట్ ఈటింగ్' అలవాటు మన శరీరానికి ఒక నిశ్శబ్ద శత్రువులా మారుతోంది. వేగంగా తినడం వల్ల కలిగే ప్రధాన నష్టాలు ఇవే.. మనం ఆహారం తిన్నప్పుడు కడుపు నిండిందనే సంకేతం మెదడుకు చేరడానికి దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. మనం వేగంగా తిన్నప్పుడు, మెదడుకు ఆ సంకేతం అందేలోపే అవసరానికి మించి ఎక్కువ ఆహారాన్ని తినేస్తాం. దీనివల్ల శరీరంలోకి అదనపు కేలరీలు చేరి, అతి త్వరగా బరువు పెరగడానికి దారితీస్తుంది.జీర్ణక్రియ అనేది నోటి నుంచే ప్రారంభమవుతుంది. ఆహారాన్ని బాగా నమిలినప్పుడు లాలాజలంలోని ఎంజైమ్లు కలిసి ఆహారం మెత్తగా మారుతుంది. వేగంగా తిన్నప్పుడు ఆహారం సరిగ్గా నలగదు. పెద్ద పెద్ద ముక్కలుగా కడుపులోకి వెళ్లడం వల్ల జీర్ణకోశంపై అదనపు భారం పడుతుంది. దీనివల్ల అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం మరియు ఎసిడిటీ వంటి సమస్యలు నిరంతరం వేధిస్తాయి.వేగంగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. దీనిని నియంత్రించడానికి శరీరం ఎక్కువ ఇన్సులిన్‌ను విడుదల చేయాల్సి వస్తుంది. కాలక్రమేణా ఇది 'ఇన్సులిన్ రెసిస్టెన్స్'కు దారితీస్తుంది. ఫలితంగా టైప్–2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం రెండింతలు పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.వేగంగా తినే వారిలో అధిక రక్తపోటు (ఃఖ), కొలెస్ట్రాల్ పెరగడం, నడుము చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వంటి సమస్యల సమాహారమైన 'మెటబాలిక్ సిండ్రోమ్' వచ్చే అవకాశం ఎక్కువ. ఇవన్నీ కలిసి చివరకు గుండె జబ్బులకు దారితీస్తాయి. డిస్ట్రాక్షన్స్ వద్దు– భోజనం చేసేటప్పుడు మొబైల్ ఫోన్, టీవీ లేదా ల్యాప్‌టాప్ చూడటం మానేయండి. కేవలం ఆహారంపైనే దృష్టి పెట్టండి. సమయం కేటాయించండి– భోజనం కోసం కనీసం 20 నిమిషాల సమయాన్ని కేటాయించుకోండి. భోజనానికి అరగంట ముందు నీరు తాగండి, కానీ తింటున్నప్పుడు ఎక్కువగా తాగకండి.

మనం ఏమి తింటున్నామనేది ఎంత ముఖ్యమో, ఎలా తింటున్నామనేది కూడా అంతే ముఖ్యం. నిమ్మళంగా తినడం వల్ల ఆహారం రుచిని ఆస్వాదించడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉండవచ్చు. నేటి నుంచే మీ భోజన వేగాన్ని తగ్గించి, సంపూర్ణ ఆరోగ్యం వైపు అడుగులు వేయండి.

## చక్కెర మానేస్తే జరిగే అద్భుతాలు



చక్కర ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదమేనని వైద్య నిపుణులు పదేపదే చెబుతుంటారు. అయితే మీరు ఒక్క పది రోజులు షుగర్ తీసుకోవడం మానేస్తే మీ శరీరంలో జరిగే అద్భుతాను చూసి మారే ఆశ్చర్యపోతారు. ఊవజీశ్రీబిష్ర ఃవనివటతిబిబ: చక్కెర అనేక వ్యాధులకు కారణమవుతుంది. శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెర తినడం వల్ల శరీరానికి నష్టం జరుగుతుంది. అందుకే చాలా మంది చక్కెరను వదులుకోవాలని సలహా ఇస్తారు. మీరు వరుసగా పది రోజులు మీ ఆహారం నుండి చక్కెరను తొలగిస్తే మీ శరీరంలో అనేక మార్పులను మీరు గమనించవచ్చు. చక్కెర తినడం వల్ల మెదడులో డోపమైన్ విడుదల అవుతుంది. చక్కెరను తగ్గించడం వల్ల మొదట్లో మీరు ఉత్సాహంగా అనిపించవచ్చు. కానీ మీరు చక్కెర లేని ఆహారాన్ని తినడం అలవాటు చేసుకున్న తర్వాత, మీ శరీరంపై అనేక సానుకూల ప్రభావాలను చూడటం ప్రారంభిస్తారు. మీరు చక్కెరను వదులుకుంటే, మీరు మరింత తాజాగా ఉంటారు. మీ చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చక్కెరను తగ్గించడం వల్ల ఉబ్బరం తగ్గుతుంది. రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది. దీనితో పాటు ఒకటి నుండి రెండు కిలోల బరువు తగ్గుతుంది. చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అందుకే చక్కెరను మానేయాలని వైద్య నిపుణులు పదేపదే సూచిస్తుంటారు. (నోట్– ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం అందిస్తున్నాము.

## సమ్మర్‌లో చన్నీటి స్నానం చేస్తే..

ఎండలో తిరిగి అలిసిపోయి ఇంటికి రాగానే.. గొంతు ఎండిపోయి ఫ్రిజ్‌లో చల్లని నీళ్లు తాగాలని లేదా ఐస్ లాంటి చల్లని నీటితో స్నానం చేయాలని అనిపించడం సహజం. ఆ నిమిషానికి అది ఎంతో హాయిగా, తక్షణ ఉపశమనం ఇచ్చినట్లు అనిపించినా, ఈ అలవాటు మన శరీరానికి మేలు చేయడం కంటే హాని చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడంలో మన మెదడు చేసే సహజ ప్రక్రియకు ఈ అతి చల్లని నీరు పెద్ద ఆటంకం కలిగిస్తుంది. దీని వల్ల కలిగే దుష్ప్రభావాలు, అసలు ఎండాకాలంలో ఎలాంటి నీటితో స్నానం చేయాలో వివరంగా తెలుసుకుందాం. వేసవిలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటినప్పుడు మన శరీరం తనను తాను చల్లబరుచుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో మనం తీసుకునే 'కోల్డ్ షవర్' నిర్ణయం శరీర సహజ ప్రక్రియకు విరుద్ధంగా మారుతుంది. అకస్మాత్తుగా చల్లని నీటిని శరీరంపై పోసుకోవడం వల్ల కలిగే ప్రధాన నష్టాలు ఇవే.. 1. శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధీకరణలో ఆటంకం: బయట వేడి ఎక్కువగా ఉన్నప్పుడు, మన చర్మం దగ్గర ఉండే రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. దీనివల్ల రక్త ప్రసరణ పెరిగి, చెమట రూపంలో అంతర్గత వేడి బయటకు పోయి శరీరం చల్లబడుతుంది. అయితే, మనం అకస్మాత్తుగా అతి చల్లని నీటిని పోసుకున్నప్పుడు, ఆ రక్తనాళాలు ఒక్కసారిగా కుంచించుకుపోతాయి. దీనివల్ల శరీరంలోని వేడి లోపలే ఉండిపోయి, బయటకు పోవడానికి మార్గం ఉండదు. అందుకే స్నానం చేసిన ఐదు నిమిషాలకే మీకు మళ్ళీ విపరీతమైన చెమట పట్టడం మొదలవుతుంది. 2. మెదడుకు తప్పుడు సంకేతాలు: చల్లని నీరు చర్మంపై పడగానే, అక్కడి సెన్సార్లు మెదడుకు "బయట వాతావరణం చల్లగా ఉంది" అనే తప్పుడు సమాచారాన్ని పంపుతాయి. దీనివల్ల మెదడు వేడిని బయటకు పంపే ప్రక్రియను ఆపివేసి, శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి అంతర్గత ఉష్ణోగ్రతను పెంచుతుంది. అంటే మీరు చల్లబడాలని స్నానం చేస్తే, మీ శరీరం మాత్రం లోపల వేడిని పెంచుకుంటుందన్నమాట. 3. బాడీ షాక్, కండరాల నొప్పులు: ఎండలో తిరిగి వచ్చిన వెంటనే ఐస్ కోల్డ్ వాటర్ కింద నిలబడితే శరీరం 'షాక్'కు గురవుతుంది. దీనివల్ల హృదయ స్పందన రేటు ఒక్కసారిగా పెరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం వంటివి జరుగుతాయి. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరం. అలాగే వేడికి రిలాక్స్ అయిన కండరాలు అకస్మాత్తుగా చల్లని నీరు తగలగానే బిగుసుకుపోయి నొప్పులకు దారితీస్తాయి. వేసవిలో అతి చల్లని నీటి కంటే గోరువెచ్చని నీరు లేదా సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద ఉండే నీటితో స్నానం చేయడం ఉత్తమం. గోరువెచ్చని నీరు చర్మంపై పడినప్పుడు రక్త ప్రసరణ మెరుగుపడి, వేడి సహజంగా బయటకు పోతుంది. స్నానం ముగిసిన తర్వాత మన శరీరం క్రమంగా చల్లబడుతుంది, దీనివల్ల ఎక్కువ సేపు హాయిగా ఉంటుంది. తక్షణ ఉపశమనం కంటే దీర్ఘకాలిక ఆరోగ్యమే ముఖ్యం. ఎండలో నుంచి రాగానే కనీసం 15–20 నిమిషాలు విశ్రాంతి తీసుకుని, శరీరం సాధారణ స్థితికి వచ్చాక మాత్రమే స్నానం చేయడం అలవాటు చేసుకోండి!

# చెరుకు రసం తాగుతున్నారా?





వేసవి కాలం ప్రారంభమైంది. ఎండలు బాగా దంచి కొడుతున్నాయి. ఈ అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం అలసిపోయి, డీహైడ్రేషన్ కు గురవుతుంది. దాహార్తిని తీర్చుకోవడానికి, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చాలా మంది పండ్ల రసాలు, ఐస్ క్రీమ్‌లు, నిమ్మకాయ సోడా, బాదం పాలు, ద్రాక్ష పండ్ల జ్యూసు వంటివి ఆశ్రయిస్తారు. వేసవిలో చెరుకు రసం ఉపశమనం అందించినప్పటికీ, అధికంగా తాగడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభమైంది. ఎండలు బాగా దంచి కొడుతున్నాయి. ఈ అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం అలసిపోయి, డీహైడ్రేషన్ కు గురవుతుంది. దాహార్తిని తీర్చుకోవడానికి, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చాలా మంది పండ్ల రసాలు, ఐస్ క్రీమ్‌లు, నిమ్మకాయ సోడా, బాదం పాలు, ద్రాక్ష పండ్ల జ్యూసు వంటివి ఆశ్రయిస్తారు. వీటిలో చెరుకు రసం చాలా ప్రజాదరణ పొందిన పానీయం.. ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువగా ఉంటాయి.. అయితే, చెరుకు రసం తీసుకోవడం విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి చెరుకు రసం మంచిది.. ఎందుకంటే ఇందులో మెగ్నీషియం, మాంగనీస్, జింక్, ఐరన్, కాల్షియం, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఈ పోషకాలు మన శరీరానికి అవసరమైనవే. కానీ, ఎక్కువగా తాగొద్దు అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రసం అధికంగా సేవించడం వల్ల ఆరోగ్యానికి మంచిది కాదని వారి అభిప్రాయం. చెరుకు రసం ఎండాకాలంలో శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంతోపాటు.. చలువ చేస్తుంది. ఇది కాలేయ పనితీరును, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇంకా మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.. రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు.. చర్మ సంరక్షణకు సహాయపడుతుంది. వైద్య నిపుణుల ప్రకారం.. ఒక గ్లాసు చెరుకు రసంలో సుమారు 250 కేలరీలు, 100 గ్రాముల చక్కెర ఉంటుంది. ఈ అధిక చక్కెర కంటెంట్, కేలరీలు రోజువారీ లేదా అధిక మోతాదులో తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా, దీనివల్ల ఊబకాయం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వారు సూచిస్తున్నారు. ఊబకాయం అనేది అనేక ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు మూల కారణం.. అంతేకాకుండా, చెరుకు రసం అధికంగా తాగడం వల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కూడా రావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సైడ్ ఎఫెక్ట్స్ రోగాలకు దారితీసి, చివరకు ఆసుపత్రుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అప్పుడు వైద్య ఖర్చులు కూడా ఎక్కువ అవుతాయి. కాబట్టి, వేసవిలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి ఏ పానీయాలు మంచివి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై సరైన అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యం. మనకు

అందుబాటులో ఉండే వైద్య నిపుణులను సంప్రదించి, వారి సలహాలు పాటించడం ఉత్తమం. ఆరోగ్యానికి ఎప్పుడు ఏమి అవుతుందో తెలియదు కాబట్టి, వేసవిలో శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. వైద్యుల సూచనలను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# రాగిజావ.. ఇక టిఫిన్ అక్కర్లేదు






రాగి జావ చిరుధాన్యాల్లో ఒకటి. ఇది కాల్షియం, ఐరన్, పీచుపదార్థాలతో నిండిన ఆరోగ్యకరమైన అల్పాహారం. ఫెర్మెంటెడ్ రాగి జావ జీర్ణవ్యవస్థకు, బరువు తగ్గడానికి ఉపకరిస్తుంది. పిల్లలకు మెదడు అభివృద్ధి, ఎముకల పెరుగుదలకు తోడ్పడుతుంది. ఇది ముఖ్యంగా అల్పాహారంగా తీసుకోవడానికి అనువైనది. సమయం లేనివారు లేదా మార్పు కోరుకునే వారికి రాగి జావ ఒక మంచి ప్రత్యామ్నాయం.

రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. రాగి జావ మన దైనందిన ఆహారంలో చేర్చుకోవడానికి ఎంతో ఆరోగ్యకరమైన ఎంపిక అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.. వాస్తవానికి రాగులు చిరుధాన్యాల కోవకు చెందినవి.. రాగి జావ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎవరు తీసుకోవాలి, ఎవరు తీసుకోకూడదు వంటి అంశాలను ఈ కథనంలో తెలుసుకుందాం.. రాగి జావలో కాల్షియం, ఐరన్, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఉదయం అల్పాహారంగా రాగి జావ తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. ఇడ్లీ, దోశ వంటి సంప్రదాయ అల్పాహారాలకు సమయం లేని వారికి లేదా తేలికపాటి ఆహారాన్ని ఇష్టపడే వారికి రాగి జావ ఉత్తమ ప్రత్యామ్నాయం. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది.

మధుమేహులు రాగి జావ తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. రాగి జావ గ్లైసెమిక్ ఇండెక్స్ మధ్యస్థంగా ఉండటం వలన, కొంతమందిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల, మధుమేహులు రాగి జావను నివారించడం లేదా తప్పనిసరిగా తీసుకోవాలని భావిస్తే, పరిమిత మోతాదులో తీసుకుంటూ చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం మంచిది. రాగి జావను వివిధ రకాలుగా తయారుచేసుకోవచ్చు. దీనిని పాలు, మజ్జిగ లేదా పెరుగుతో కలిపి తీసుకోవచ్చు. అయితే, ఫెర్మెంటెడ్ రాగి జావ మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఫెర్మెంటెడ్ రాగి జావ అంటే, ముందు రోజు రాగి పిండిని పులియబెట్టి, దానిని మరుసటి రోజు ఉదయం పెరుగు లేదా మజ్జిగతో కలిపి తీసుకోవడం. ఈ విధంగా తీసుకోవడం వల్ల ఇది మంచి ప్రీబయోటిక్‌గా పనిచేసి, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గట్ హెల్త్ బాగుంటుంది. అసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారికి ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది తేలికపాటి, పోషకమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. ఉదయం పూట భారీగా కాకుండా తేలికగా, సౌకర్యవంతంగా ఉండాలనుకునే వారికి రాగి జావ ఒక అద్భుతమైన ఎంపిక.. చిన్నపిల్లలకు రాగి జావను మంచి స్నాక్‌గా ఇవ్వవచ్చు. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత లేదా ఆకలిగా ఉన్నప్పుడు, రాగి జావలో కొద్దిగా బెల్లం, ఒక స్పూన్ స్వచ్ఛమైన ఆవు నెయ్యి కలిపి ఇవ్వడం వల్ల రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. ఆవు నెయ్యిలో ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి పిల్లల మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. అంతేకాకుండా, చిన్నపిల్లలకు ఎముకల పెరుగుదలకు అవసరమైన కాల్షియం రాగి జావ ద్వారా లభిస్తుంది. టీనేజర్లలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లయితే, రాగి జావ తీసుకోవడం వల్ల అవి మెరుగుపడతాయి. ఎముకల అభివృద్ధికి కూడా ఇది సహాయపడుతుంది. మలబద్ధకంతో బాధపడేవారికి రాగి జావలోని పీచుపదార్థాలు ఎంతో ఉపకరిస్తాయి. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచి, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. అందువల్ల, రాగి జావను రోజూ లేదా కనీసం వారానికి మూడు నుంచి నాలుగు సార్లు అయినా తీసుకోవడం వల్ల ఈ ప్రయోజనాలను పొందవచ్చు. ఇది ప్రకృతిసిద్ధంగా లభించే, మన శరీరానికి ఎంతో మేలు చేసే ఆహారం. ఆరోగ్యకరమైన జీవితం కోసం రాగి జావను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోండి.

# మోషన్ ఫ్రీగా అవ్వడం లేదా..?



కుప్పింటాకు ప్రకృతి ప్రసాదించిన అద్భుత ఔషధం. ఇది కండరాల నొప్పులను తగ్గించడంలో, డయాబెటిక్ పుండ్లను మాన్పడంలో, ఆస్తమా, బ్రోంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. అలాగే, మలబద్ధకం, చెవి ఇన్ఫెక్షన్లకు కూడా ఉపశమనాన్నిస్తుంది. ప్రకృతి వైద్య విధానంలో మందులు లేకుండా జబ్బులు తగ్గించుకోవడానికి మంచి ఆహార నియమాలు, అలవాట్లను మార్చుకోమని సూచిస్తారు. అయితే, కొద్దిమందికే ఈ నియమాలను పాటించడం ఇష్టమవుతుంది. చాలామందికి ఆహారపు అలవాట్లను మార్చుకోవడం కష్టంగా అనిపిస్తుంది. అలాంటి వారి కోసం, కొన్ని రకాల సమస్యలను తగ్గించుకోవడానికి ప్రకృతి సిద్ధమైన ఔషధాలు, ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆయుర్వేద వైద్యులు అందించబడిన ఈ సమాచారం ప్రకారం, కుప్పింటాకు ఐదు రకాల ఆరోగ్య లాభాలను అందిస్తుంది. 1. కండరాల నొప్పుల నివారణ: కుప్పింటాకు కషాయం కండరాల నొప్పుల నుండి తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది. ఐదారు ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటిని త్రాగడం వల్ల ఇందులో ఉండే పాలిఫినాల్స్, ఇతర రసాయన సమ్మేళనాలు కండరాలను రిలాక్స్ చేస్తాయి. కండర కణాలలో వచ్చే వాపును తగ్గించి, నొప్పులకు కారణమయ్యే ప్రోస్టాగ్లాండిన్స్ ఉత్పత్తిని తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది. అలసటగా, నొప్పులుగా ఉండే కండరాలకు కుప్పింటాకు రసం సైంటిఫిక్‌గా ప్రయోజనకరంగా ఉంటుందని రుజువైంది. 2. డయాబెటిక్ పుండ్లు, గాయాల మానుపు: డయాబెటిస్ ఉన్నవారికి దెబ్బలు, పుళ్ళు, గాయాలు మానడం కష్టమవుతుంది, కొన్నిసార్లు గ్యాంగ్రీన్ వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మానకుండా ఉన్న అలాంటి గాయాలపై కుప్పింటాకు రసాన్ని వేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ రసంలో ఉండే గ్యాలిక్ ఆసిడ్, ఎలాజిక్ ఆసిడ్ యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి గాయం ప్రాంతంలోని బ్యాక్టీరియా, ఫంగస్ క్రిములను చంపి, వాపును తగ్గించి, పుండు మానడానికి తోడ్పడతాయి. అంతేకాకుండా, పుండు భాగంలో కొలాజన్ మెష్ ఏర్పడటాన్ని ప్రోత్సహించి, సాధారణ చర్మం వేగంగా అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది. 3. శ్వాసకోశ ఆరోగ్యానికి (ఆస్తమా, దగ్గు, కఫం): కుప్పింటాకులో ఉండే సపోనిన్స్, ఫినాల్స్ ఆస్తమా, దగ్గు, కఫం, శ్లేష్మాలు ఎక్కువగా ఉన్నవారికి, ఊపిరితిత్తులలో వాపు (బ్రోంకైటిస్) ఉన్నవారికి ఉపయోగపడతాయి. ఐదారు కుప్పింటాకులను నీటిలో మరిగించి, వడకట్టిన కషాయానికి తేనె కలుపుకొని త్రాగడం వల్ల ఊపిరితిత్తులలో శ్లేష్మం ఉత్పత్తి చేసే కణాల అతి క్రియాశీలతను తగ్గిస్తుంది. ఇది శ్లేష్మాన్ని, వాపును సహజంగా తగ్గించి, ఆస్తమా మరియు బ్రోంకైటిస్ రోగులకు ఊపిరితిత్తులలోని కండరాలను రిలాక్స్ చేయడానికి సహాయపడుతుంది. ఎలుకల పైన చేసిన పరిశోధనల ద్వారా కుప్పింటాకు ఊపిరితిత్తుల వాపును, ఆయాసం, కఫం, దగ్గును తగ్గించడంలో ఉపయోగపడుతుందని రుజువైంది. 4. మలబద్ధకం నుండి ఉపశమనం: కొంతమందికి మలద్వారం వద్ద స్పింక్టర్ బాగా బిగుతుగా ఉండటం వల్ల మోషన్ సరిగా అవ్వదు. అలాంటి వారికి కుప్పింటాకు ముద్దను తయారుచేసి, మలద్వారంలో ఉంచితే ఆ స్పింక్టర్ రిలాక్స్ అయ్యి మోషన్ ఫ్రీగా అవ్వడానికి సహాయపడుతుంది. ఇది సహజ సిద్ధమైన సపోసిటరీ వలె పనిచేసి, మలబద్ధకం ఉన్నవారికి ఉపశమనాన్ని అందిస్తుంది. 5. చెవి ఇన్ఫెక్షన్లు, చీము కారడం: చెవిలో చీము కారడం, వాపు, బ్యాక్టీరియల్ లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఉన్నవారికి కుప్పింటాకు రసం ప్రయోజనకరంగా ఉంటుంది. కుప్పింటాకు రసాన్ని తీసి ఐదు, ఆరు చుక్కలు చెవిలో వేస్తే, అది యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. చెవిలో వాపును తగ్గించి, చీము కారడాన్ని నివారిస్తుంది. 2017లో మలేషియా దేశం వారు జరిపిన పరిశోధనల ద్వారా చెవిలో వాపును తగ్గించడంలో కుప్పింటాకు యొక్క ఈ ఉపయోగం నిరూపించబడింది. మనం ఇప్పటివరకు కుప్పింటాకు అందించే ఐదు రకాల లాభాలను తెలుసుకున్నాం. పూర్వం డాక్టర్లు, మందులు లేనప్పుడు మన ఋషులు ప్రకృతి ప్రసాదించిన ఔషధాలలో ఏది ఏ సమస్యకు పని చేస్తుందో గుర్తించి ఆయుర్వేద వైద్య శాస్త్రాన్ని అందించారు.

# భారత్-ఐర్లాండ్ టీ20 సిరీస్ షెడ్యూల్ ఖరారు

**జూన్‌లో ఐర్లాండ్‌తో టీమిండియా రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్**

**ప్రపంచకప్ గెలిచాక భారత జట్టు ఆడబోయే తొలి టీ20 సిరీస్ ఇదే**

**జూన్ 26, 28 తేదీల్లో బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌ల నిర్వహణ**

**ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్ ముగిశాక ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత్**




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత క్రికెట్ జట్టు తన తదుపరి సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరుగుతాయి.

2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టు ఆడబోయే తొలి టీ20 సిరీస్ ఇదే కావడం విశేషం. ఐపీఎల్ 2026 ముగిసిన అనంతరం టీమిండియా తొలుత ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. జూన్ 20న వన్డే సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు బయలుదేరుతుంది. ఈ సిరీస్ పూర్తికాగానే జులై 1 నుంచి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది.

"సీనియర్ పురుషుల జట్టు 2026 జూన్‌లో ఐర్లాండ్‌లో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం పర్యటిస్తుంది"
అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు (2018, 2022, 2023) ఐర్లాండ్‌లో పర్యటించినప్పటికీ 2007 తర్వాత బెల్‌ఫాస్ట్‌లో ఆడటం ఇదే తొలిసారని బోర్డు వివరించింది.

మరోవైపు ఐర్లాండ్ జట్టు కూడా తీరిక లేకుండా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. న్యూజిలాండ్‌తో చారిత్రక టెస్టు మ్యాచ్, భారత్‌తో సిరీస్, ఆ తర్వాత ఆగస్టులో ఆఫ్ఘనిస్థాన్‌తో ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది.

**భారత్ – ఐర్లాండ్ సిరీస్ షెడ్యూల్:**

మొదటి టీ20: జూన్ 26 (బెల్‌ఫాస్ట్, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు)

రెండో టీ20: జూన్ 28 (బెల్‌ఫాస్ట్, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు)

# 15 ఏళ్ల క్రికెటర్.. ఒక్క సెంచరీతో రికార్డులు బద్దలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ మహిళల టీ20లో రువాండా బ్యాటర్ ఫ్యానీ సరికొత్త ఘనత సృష్టించింది. నైజీరియా ఇన్విటేషనల్ మహిళల అంతర్జాతీయ టీ20 టోర్నమెంట్‌లో శుక్రవారం ఘనాతో జరిగిన మ్యాచ్‌లో ఫ్యానీ (111: 65 బంతుల్లో 17 ఫోర్లు) శతకం బాదింది. అంతర్జాతీయ టీ20ల్లో అతిపిన్న వయసులో (15 ఏళ్ల 223 రోజులు) సెంచరీ చేసిన క్రికెటర్‌గా రికార్డ్ నెలకొల్పింది. అంతేకాకుండా మహిళల అంతర్జాతీయ టీ20 చరిత్రలో అరంగేట్రంలోనే సెంచరీ చేసిన తొలి క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలకో పేరిట ఉన్న రికార్డును ఫ్యానీ అధిగమించింది. అలకో 2019లో మాలీపై 116 పరుగులు చేసింది. అప్పుడు ఆమె వయసు 16 ఏళ్ల 233 రోజులు. ఇక 2005లో టౌంటన్‌లో ఇంగ్లాండ్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ కారెన్ రోల్టన్ నెలకొల్పిన ఓ రికార్డునూ ఫ్యానీ అధిగమించింది. అరంగేట్ర మ్యాచ్‌లో కారెన్ 96 పరుగులతో అజేయంగా నిలిచింది. ఇప్పుడు సెంచరీతో ఫ్యానీ ఆ రికార్డును బద్దలు కొట్టింది. మహిళల అంతర్జాతీయ టీ20 అరంగేట్రంలో అత్యధిక స్కోరు నమోదు చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది. పురుషుల క్రికెట్‌లో అంతర్జాతీయ టీ20 సెంచరీ రికార్డు అత్యంత పిన్న వయస్కుడైన ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ పేరిట ఉంది. 18 ఏళ్ల 280 రోజుల వయసులో అతడు స్విట్జర్లాండ్‌పై సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. దీంతో ఫ్యానీ అంతర్జాతీయంగా తక్కువ వయసులోనే శతకం చేసిన క్రికెటర్‌గా అవతరించింది.మొదట బ్యాటింగ్ చేసిన రువాండా 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఘనా కేవలం 88/8 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. తన అద్భుతమైన శతక ఇన్నింగ్స్‌కు ఫ్యానీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.



# ఒక్క క్షణం వృథా చేయొద్దు.. ఈసారి మరింత పోటీ: విరాట్ కోహ్లీ వార్నింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి కప్పును నెగ్గాలని చూస్తోంది. ఇప్పటికే స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సాధన మొదలుపెట్టేశాడు. అయితే, ఈసారి పోటీ తీవ్రంగా ఉంటుందని.. ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దని సహచరులను హెచ్చరించాడు. ఈ మేరకు తమ జట్టు ప్రాక్టీస్‌కు సంబంధించి ఆర్సీబీ ఓ వీడియో గ్లింప్స్‌ను షేర్ చేసింది. అందులో ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ జట్టులోకి వచ్చిన కొత్త ప్లేయర్లకు స్వాగతం పలికాడు. ఈ సందర్భంగా సీజన్‌లో ఎలాంటి పోటీ ఉంటుందో విరాట్ కోహ్లీ ఉద్బోధించాడు."గత మూడు సీజన్లలో మన కుర్రాళ్లు చాలా కష్టపడ్డారు. గతేడాది మనం ఛాంపియన్‌లుగా నిలిచాం. అయితే, ఈసారి మరింత పోటీ ఉండబోతోంది. ఇతర జట్లు కూడా బలంగా ఉన్నాయి. మనకున్న ఈ కొన్ని రోజుల్లో ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దు. మనమే ముందుండాలి. ఈ రెండున్నర నెలలు 120 శాతం శ్రమిద్దాం. సవాళ్లను ఎదుర్కొనేందుకు మీరంతా సిద్ధంగా ఉన్నారని మిమ్మల్ని చూస్తుంటేనే అర్థమవుతోంది" అని విరాట్ కోహ్లీ అన్నాడు.

**మనం స్క్వాడ్‌ను బలోపేతం చేశాం: ఆండీ**

"కొత్త సీజన్ ప్రారంభానికి ముందు జట్టుతో కలిసిన ప్లేయర్లకు స్వాగతం. ఇటీవల అండర్ -19 వరల్డ్ కప్‌ను నెగ్గిన భారత జట్టులో సభ్యులు కనిష్క్, విహాన్‌కు శుభాకాంక్షలు. గత వేలం చాలా ఆసక్తికరంగా మారింది. మన స్క్వాడ్‌ను చాలా బలంగా మార్చుకున్నాం. నాణ్యమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాం. ఈ సీజన్‌లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తామని ఆశిస్తున్నా" అని ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ వెల్లడించాడు.

**మళ్లీ ఆర్సీబీదే టైటిల్: అశ్విన్**

"ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గడం ఏ జట్టుకైనా సులువేం కాదు. ఇప్పుడున్న స్క్వాడ్‌తోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండోసారి విజేతగా నిలుస్తుందని భావిస్తున్నా. జట్టు పునర్నిర్మాణంలో ఆర్సీబీ చాలా తెలివిగా వ్యవహరించింది. హేజిల్ వుడ్ అందుబాటులోకి వచ్చి.. ఫిల్ సాల్ట్ ఫామ్ అందుకొంటే ఆర్సీబీకి తిరుగుండదు" అని మాజీ క్రికెటర్ అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ తన తొలి మ్యాచ్‌ను మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది.

# ఉస్తాద్, ధురంధర్.. ఊపిరి పోసినట్లే..



ఎరుపు రంగులో జ్యోతి పూర్వాజ్ స్టన్స్







శోభితా ధూళి పాల లుక్ హైలైట్

ఉగాది పండుగ సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్: ది రివెంజ్ చిత్రాలు.. థియేటర్స్ లో రిలీజ్ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద కొత్త జోష్ తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఫిబ్రవరి నెల అంతా బాక్సాఫీస్ వద్ద నిరాశే మిగిల్చింది. పెద్ద సినిమాలు లేకపోవడం, విడుదలైన చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో థియేటర్లలో కలెక్షన్లు వీక్ గా కనిపించాయి.

2026 సంక్రాంతి సందర్భంగా వచ్చిన సినిమాల ఎఫెక్ట్ తగ్గిన తర్వాత, టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో సందడి కనిపించలేదు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు కొత్త హిట్ కోసం ఎదురుచూస్తూ ఉండగా, మార్చి నెల ప్రారంభం కూడా పెద్దగా ఆశలు రేకెత్తించలేదు. అయితే ఆ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిన రెండు సినిమాలు ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ ది రివెంజ్.ఆ రెండు చిత్రాలు విడుదలైన తొలి రోజు సాలిడ్ వసూళ్లు సాధించాయి.. ముఖ్యంగా ఉస్తాద్ సినిమా తెలుగు రాష్ట్రాల్లో మొదటి రోజు రూ.37 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ధురంధర్ కూడా అన్ని భాషల్లో కలిపి తెలుగు రాష్ట్రాల్లో దాదాపు రూ.10 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టినట్లు సమాచారం. అలా రెండు సినిమాలు కూడా మంచి ఓపెనింగ్స్ అందుకున్నాయని చెప్పాలి.ఇప్పుడు ఆ రెండు సినిమాల విజయంతో ఫిబ్రవరి నెలలో నెలకొన్న బాక్సాఫీస్ నిరుత్సాహం ఒక్కసారిగా తొలగిపోయింది. ప్రేక్షకులు మళ్లీ థియేటర్లకు రావడం ప్రారంభించడంతో ఎగ్జిబిటర్లలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ముఖ్యంగా వీకెండ్ కలెక్షన్లు కూడా భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే అడ్వాన్స్ బుకింగ్స్ ఫుల్ జోష్ లో జరుగుతున్నాయని వినికిడి.అయితే ఉస్తాద్ సినిమా విషయానికొస్తే.. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని అర్థమవుతోంది. కథ, యాక్షన్ సన్నివేశాలు, సంగీతం.. సినిమాకు పాజిటివ్ ఎలిమెంట్స్ గా మారినట్లు తెలుస్తోంది. మరోవైపు ధురంధర్ 2 కూడా తన కథనం, ప్రెజెంటేష న్‌తో ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుని దూసుకుపోతోంది.

ఏదేమైనా సంక్రాంతి తర్వాత వచ్చిన గ్యాప్ ను ఆ రెండు సినిమాలు భర్తీ చేయడం విశేషం. సాధారణంగా ఇది పరీక్షల సమయం కాబట్టి.. సినిమాలకు కొంత కష్టమైనదిగా భావిస్తారు. కానీ సరైన కంటెంట్ ఉంటే ఎప్పుడైనా ప్రేక్షకులు థియేటర్లకు వస్తారనే విషయాన్ని ఉస్తాద్, ధురంధర్ ది రివెంజ్ నిరూపించాయి. మొత్తానికి, ఫిబ్రవరి నెలలో ఏర్పడిన నిరాశ పరిస్థితికి ముగింపు పలుకుతూ ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ సినిమాలు బాక్సాఫీస్ కు కొత్త ఊపిరి పోశాయని చెప్పాలి. మరి ఆ రెండు సినిమాలు ఎంతటి వసూళ్లు సాధిస్తాయో అంతా వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965